ANN తెలుగు

Follow: @ANNTELUGU

04-03-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 92 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## లయన్ సఫారీకి ప్రధాని మోదీ

**కెమెరా చేతపట్టి.. క్లిక్ క్లిక్.. ఫొటోలు వైరల్**

మహా: ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లయన్ సఫారీ కి వెళ్లారు. నిత్యం అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉండే ప్రధాని.. తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యానికి వెళ్లారు. కెమెరా చేతపట్టి సింహాలను ఫొటోలు తీశారు. ప్రధాని మోదీ మూడు రోజుల పర్యటన నిమిత్తం తన సొంత రాష్టం గుజరాత్ కు వెళ్లిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం అక్కడ సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి సాసన్‌లోని రాష్ట్ర అటవీ శాఖ నిర్వహించే అటవీ అతిథి గృహం సిన్హ్ సదన్‌లో రాత్రి బస చేశారు. సోమవారం ఉదయం స్థానిక మంత్రులు, అటవీ శాఖ సీనియర్ అధికారులతో కలిసి సిన్హ్ సదన్ నుంచి సఫారీకి బయల్దేరారు. జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యంలో సింహ సఫారీకి వెళ్లారు.

**టాప్ న్యూస్**


### కేసీఆర్‌తో కిషన్ రెడ్డి కుమ్మక్కు అయ్యారు



- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- కేంద్రం సహకరిస్తే తెలంగాణ నెంబర్ వన్ అవుతుంది..
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

03

### సీఎం రేవంత్‌కు పదవీ గండం



- అందుకే తెలంగాణకు మీనాక్షి నటరాజన్
- బీజేఎల్ పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

02

### హరీశ్‌రావు దుబాయ్ వెళ్లిన రోజే కేదార్ మరణం



- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- హరీశ్‌రావు డిక్షనరీలో అగ్గిపెట్టె, రాజీనామాలు తొలిపదాలు

02



ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం

### తెలంగాణ హైకోర్టులో పిల్

- పిల్ దాఖలు చేసిన నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్
- ప్రమాదం జరిగి పది రోజులవుతున్నా కార్మికుల ఆచూకీ లేదని వెల్లడి
- ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి

వివరాలు 3లో



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు

### ఏఐ పాఠాలు

- 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ
- కృత్రిమ మేధపై మైక్రోసాఫ్ట్ ఫౌండేషన్ బోధన
- 500 ప్రభుత్వ పాఠశాలల్లో 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ
- తెలుగు, ఆంగ్లం తెలిసిన వారితో పాఠాలు

వివరాలు 3లో



### ఇది చారిత్రాత్మక తీర్పు

- ఈ తీర్పు టీచర్లకు, మోదీకి అంకితం
- ప్రధాన ప్రతిపక్షం బీజేపీయేనని తేలింది
- ఈ తీర్పు బీజేపీ కార్యకర్తల పోరాటాలకు భరోసా కల్పించింది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కైనా బీజేపీని ఓడించేందుకు ప్రత్యర్థులకు సహకరించాయి
- ఆ రెండు పార్టీల చెంప చెళ్లుమనేలా తీర్పు ఇచ్చిన టీచర్లకు హ్యాట్సాఫ్
- కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇది 3వ విజయం
- తెలంగాణలో త్వరలోనే రామరాజ్యం తథ్యం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

వివరాలు 3లో



# మీనాక్షి మార్క్






**కాంగ్రెస్‌లో క్రమశిక్షణ**

### యాక్షన్ ప్లాన్ షురూ

- నేటి నుండి పార్లమెంట్ నియోజకవర్గాల వారీ సమీక్షలు
- ఇప్పటికే నివేదికలు తెప్పించుకున్న మీనాక్షి నటరాజన్
- మూడుమాసాల్లో.. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు పదవులన్నీ భర్తీ
- ఉగాదికి రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్, మహా:** ఇప్పటిదాకా ఒక లెక్క ఇప్పట్నుంచి మరో లెక్క అన్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలు మారిపోయాయి. ఇందుకు కారణం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్. గతంలో ఏం జరిగిందో కానీ ఇప్పట్నుంచి మాత్రం ఎవరైనా పార్టీకి కట్టుబడి పనిచేయాల్సిందేనన్న సిగ్నల్స్ ఇచ్చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలిగా ఈ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆమె తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు. ఆ క్రమంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆమె వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యచరణ చేపట్టారు. అందులోభాగంగా పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా వరుస సమీక్షాలను ఆమె నిర్వహిస్తున్నారు.

మిగతా 2లో

# మా నీరు మాక్కావాలి

**కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలి**

గోదావరిలో తెలంగాణ నికర జలాల వాటా తేల్చాలి

పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇవ్వండి

తెలంగాణ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందజేయండి

జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



**మహా :** కృష్ణా నది జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కృష్ణా నది పరివాహకంలో సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలు తేల్చిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం సాయంత్రం భేటీ అయ్యారు. కృష్ణా, గోదావరి నది జలాలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలోనూ ఆయా వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాతంగా ఆంధ్రప్రదేశ్‌కు 66, తెలంగాణకు 34 శాతం నీటి కేటాయింపులు చేసిందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఏళ్లుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది సైతం ఆంధ్రప్రదేశ్ తమకు కేటాయించిన మొత్తానికి మించి నీరు తరలించుకుపోయిందన్నారు.

మిగతా 2లో

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డి, మల్క కొమురయ్య విజయం

**కరీంనగర్ లో కమలం.. నల్లగొండలో పిఆర్టీయు**


టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెరొకటి.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి హోరాహోరీ

కాంగ్రెస్, బీజేపీ మధ్య టఫ్ ఫైట్..

కలవరపరుస్తున్న చెల్లని ఓట్లు .. 40వేల ఓట్లు ఔట్?

పట్టభద్ర ట్రెండ్స్ పై మంత్రి శ్రీధర్ బాబు ఆరా.. ఇది చారిత్రాత్మక తీర్పు.. బండి

నల్లగొండలో ఫలించిన జానారెడ్డి వ్యూహం





**ఖమ్మం – మహా:** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ఉత్కంఠభరితంగా మారి చివరికి శ్రీపాల్ రెడ్డిని గెలుపు వరించింది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. ఎలిమినేషన్ ప్రక్రియలో ముందంజలో ఉన్న అభ్యర్థుల బలం మారుతూ ఉండటంతో పోటీ చివరి రౌండ్ల వరకూ ఉత్కంఠంగా సాగింది. చివరికి రెండో ప్రాధాన్యత ఓట్ల కౌంటింగ్ పూర్తయిన తర్వాతే విజేత ఖరారైంది. కఠిన పోటీ మధ్య శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికై ఘన విజయం సాధించారు.

మిగతా 3లో

### మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి



- సీఎం రేవంత్ రెడ్డికి కవిత డెడ్ లైన్
- మహిళా బిల్లు కోసం కాంగ్రెస్ వత్తిడి తేలేదు
- ఆడపిల్లలకు స్కూటీలు, మహిళలకు రూ. 2500లు వెంటనే ఇవ్వాలని డిమాండ్

వివరాలు 3లో

### కృష్ణం వందే జగద్గురుమ్ !

*లివ్ అండ్ లెట్ లివ్ !!*

కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ వైఖరి, నిర్ణయాలు 'కర్మల భారం' గా తెలంగాణ ప్రజలు భావించాలి.ఆయన ఏపీకి మేలు చేసినా అందులో ఏదో 'అంతరార్థం' ఉందని అనుకునే వాళ్ళు,తెలంగాణకు 'బాపు' అన్యాయం చేయరని గట్టిగా నమ్మేవాళ్ళు కూడా లెఖ్ఖ లేనంతమంది ఉన్నారు.కానీ వాస్తవాలు వేరు.

సీనియర్ జర్నలిస్ట్ ఎస్కె జకీర్ విశ్లేషణ 4లో



# మీనాక్షి మార్క్

(మొదటిపేజీ తరువాయి)

ఆ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మెదక్, సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా ఆమె అధ్యక్షతన సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే బుధవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్, మధ్యాహ్నం 2 గంటలకు ఆదిలాబాద్, సాయంత్రం 5 గంటలకు పెద్దపల్లి పార్లమెంట్ల వారీగా నియోజకవర్గాల నేతలు పార్టీ కేడర్‌తో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ కమిటీలు, సంస్థాగత పరిస్థితిని తెలుసుకుని పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేయనున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నివేదికలు తెప్పించుకున్న మీనాక్షి పనిచేసేవారికి భవిష్యత్‌లో పెద్దపీట వేస్తామని సంకేతాలిస్తున్నారు. వరుసగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతోన్నాయి. ఈ ఎన్నికలు పూర్తయిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అలాగే పార్టీ ఫిరాయింపుల కారణంగా.. ఉప ఎన్నికల వచ్చే అవకాశముంది. ఆయా ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై చర్చించే అవకాశముందని సమాచారం. అదే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అలాంటి వేళ.. జిల్లాల్లో నియోజకవర్గాల స్థాయిలో ఉన్న లోపాలను ఎలా సరి చేసుకుని ముందుకు వెళ్లాలనే అంశాలపై చర్చించే అవకాశముంది.

**సింపుల్ గా.. ఫోకస్ గా..**

తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల బాధ్యురాలిగా ఇటీవల మీనాక్షి నటరాజన్ బాధ్యతలు చేపట్టేందుకు తొలిసారిగా ఆమె హైదరాబాద్ వచ్చారు. తన వస్తున్న సందర్భంగా నగరంలో భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని సూచించారు. అలాగే గాంధీ భవన్‌తోపాటు ఆ ప్రాంగణంలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఫొటోలు మాత్రమే ఉండాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని పార్టీ కేడర్‌కు పీసీసీ అధినేత మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. అదీకాక.. ఈ బ్యానర్లు, ఫ్లెక్సీల వల్ల పార్టీ గెలుపు అసాధ్యమని ఇటీవల జరిగిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె స్పష్టం చేశారు. ప్రజల మధ్యకు వెళ్లి.. వారి సమస్యలను తెలుసుకొని.. వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని వారికి పార్టీ వ్యవహారాల బాధ్యులు మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేశారు. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడడమే రాజకీయ లక్ష్యంగా ఉండాలన్నారు.



## మూడు నెలల ప్లాన్

మూడునెలల్లో సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేయాలన్న వ్యూహంతో పార్టీ హైకమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, భర్తీచేయడంతో పాటు స్థానిక ఎన్నికలతో ఉత్సాహం నింపాలన్న యోచనలో పార్టీ ఉంది. ముందుగా రాష్ట్రకమిటీ, జిల్లా కమిటీలు ఖరారు చేసి మండల స్థాయి, గ్రామస్థాయి కమిటీలు కూడా నియమించాలన్న యోచనతో ఉంది. మంత్రివర్గ విస్తరణ కూడా చేపట్టనున్నారు. అన్ని స్థాయిల్లో పార్టీ లో ఉత్సాహం నింపేలా పకడ్బందీ వ్యూహంతో.. పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గాల సమీక్షల అనంతరం రాష్ట్ర కమిటీని ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఉగాదికి కమిటీలు ప్రకటించాలని పార్టీ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది.

**ఫటాఫట్ నిర్ణయాలు**

పార్టీకి ఇబ్బందిగా మారిన తీన్మార్ మల్లన్నపై వేటు వేసి క్రమశిక్షణ తప్పితే ఎవరిపైనయినా చర్యలు తప్పవని అందరికీ స్పష్టమైన సంకేతాలు పంపారు. పార్టీ మద్దతుతో ఎమ్మెల్సీ అయ్యి.. ఆ తర్వాత యూటర్న్ తీసుకున్న విధానం హైకమాండ్ ను ఆశ్చర్యపరిచింది. రాహుల్ ఆలోచనలకు అనుగుణంగా రేవంత్ సర్కారు చాలా విశాలమైన ద్రుక్పథంతో కులగణన చేసింది. కానీ ప్రభుత్వ ఆలోచనను అభినందించకుండా కొందరు కాంగ్రెస్ నేతలే అసంత్రుప్త స్వరం వినిపించడంతో పరిస్థితి చేజారకుండా.. హైకమాండ్ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇక తాజాగా సీనియర్ నేత వీహెచ్ ఇంట్లో జరిగిన మీటింగ్ పైనా మీనాక్షి నటరాజన్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. మీటింగ్ కు ఎవరెవరు వచ్చారు.. ఏం మాట్లాడారన్నది కూడా తెలుసుకున్నారట. ఆ మీటింగ్ కు ప్రతిపక్ష నేతలను పిలవకుండా బావుండేదన్న అభిప్రాయంతో ఉన్నారట. ఇలా రాష్ట్ర పార్టీ నేతలకు సంబంధించిన అన్ని అప్ డేట్స్ ను మేడమ్ ఎప్పటికప్పుడు ఫాలో అవుతున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చాలామందికి కార్పొరేషన్ పదవులు దక్కాయి. పదవులు వచ్చాయి కానీ.. కొందరు నేతలు మాత్రం గాంధీభవన్ వైపు కూడా చూడడం లేదట. ఈ అంశంలోనూ మీనాక్షి సీరియస్ గా ఉన్నారట. పార్టీ ద్వారా పదవులు తీసుకుని... పార్టీని లైట్ తీసుకోవడం ఏంటని ఆమె ప్రశ్నిస్తున్నారట. అందుకే సదరు నేతలు అందరూ తనకు కనిపించాలని మేడమ్ ఆదేశాలిచ్చినట్లు టాక్. చాలామంది నేతల కార్పొరేషన్ పదవులు త్వరలోనే గడువు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ కోసం పనిచేయకుండా పదవులకే పరిమితమైన వారి రెన్యువల్ చేయొద్దన్న చర్చ జరుగుతోందట. అలాంటి వారి జాబితా ఇప్పటికే రెడీగా ఉందట. ఏదేమైనా ఇక పార్టీకి ఉపయోగపడే నేతలకే బూస్టింగ్ ఉంటుందని మీనాక్షి ఖరాఖండీగా చెప్పేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోనూ మీనాక్షి మాట్లాడినట్లు సమాచారం.

# మా నీరు మాక్కావాలి

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలి

గోదావరిలో తెలంగాణ నికర జలాల వాటా తేల్చాలి

పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇవ్వండి

తెలంగాణ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందజేయండి


జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



(మొదటిపేజీ తరువాయి)

ఇక ముందు తమ వాటాకు మించి కృష్ణా నది నీటిని ఏపీ తరలించుకొని పోకుండా చూడాలన్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలీ మెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి తెలియజేశారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022 లోనే డీపీఆర్ సమర్పించినా అనుమతుల్లో ఆలస్యం చేస్తున్నారని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. అదే సమయంలో న్యాయస్థానాల పరిధిలోని అప్పర్ భద్రకు మాత్రం అనుమతులు ఇచ్చారన్నారు. సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ బ్యారేజీలకు మాత్రం అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ మూడు ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సాంకేతిక సలహా మండలి (టీఏసీ) నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరిబనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ పథకానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కేంద్ర జల సంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేఆర్ఎంబీల నుంచి ఎటువంటి అనుమతి పొందలేదన్నారు. గోదావరిపై తాము చేపట్టిన సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదన్నారు. గోదావరి నదిలో తెలంగాణకు సంబంధించి నికర జలాల వాటాలు తేల్చాలని, గోదావరిపై తెలంగాణ చేపడుతున్న ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. అలా చేయకపోతే ఆయకట్టు స్థిరీకరణ పేరుతో తాము నష్టపోతామని, కృష్ణా డెల్టా ఆయకట్టును చూపి కృష్ణా జలాల్లో తెలంగాణకు నష్టం చేశారని ఆయన గుర్తు చేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్న అపెక్స్ కౌనిల్స్‌లోనూ ఏపీ గోదావరిబనకచర్ల ప్రాజెక్టు ఎటువంటి చర్చ జరగలేదని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో తాము ఏమాత్రం రాజీపడబోమని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, మోడి కుంట వాగు, చనాఖా కొరటా బ్యారేజీ (డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్), చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు సత్వర సాగు నీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ).. పీఎంఆర్‌పీ 2024 కింద తగిన ఆర్థిక సహాయం అందజేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సాగు నీటి ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందజేసేందుకు మౌలిక వసతుల అభివృద్ధి కింద 50 సంవత్సరాలు పాటు వడ్డీలేని రుణాలు తెలంగాణకు ఇవ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి అభ్యర్థించారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) విజయ్ భాస్కర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# ఆస్కార్-2025 విజేతలు వీరే

**ఉత్తమ సహాయ నటుడు కీరన్ కల్కిన్**

**మహా :** యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఆస్కార్ అవార్డుల సంబరం అంగరంగ వైభవంగా మొదలైంది. 'ఎ రియల్ పెయిన్' చిత్రంలో నటనకుగానూ కీరన్ కైల్ కల్కిన్ ఉత్తమ సహాయ నటుడిగా ఆస్కార్ అందుకున్నారు. ఇక ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా 'వికెడ్' చిత్రానికిగానూ పాల్ తేజ్‌వెల్‌కు ఆస్కార్ రాగా, ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్‌గా 'ఇన్ ది షాడో ఆఫ్ ది సైప్రెస్' ఎంపికైంది. మరోవైపు 97వ అకాడెమీ అవార్డుల కోసం వైవిధ్యమైన చిత్రాలు ఎంపికయ్యాయి. ఈ వేడుకకు హాలీవుడ్ ముఖ్య తారాగణంతో పాటు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. నటీమణులు ఫ్యాషన్ ప్రపంచానికి సరికొత్త భాష్యం చెబుతూ ట్రెండీ దుస్తుల్లో మెరిశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆస్కార్ అవార్డుల కార్యక్రమానికి వచ్చిన అతిథులతో నటి, వ్యాఖ్యాత అమెలియా డిమోల్డెన్‌బర్గ్ చిట్‌చాట్ చేశారు.

**ఆస్కార్ విజేతలు వీళ్లే..**

ఉత్తమ సహాయ నటుడు కీరన్ కైల్ కల్కిన్ (ది రియల్ పెయిన్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే కాన్‌క్లేవ్ (పీటర్ స్ట్రాగన్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ వికెడ్ (పాల్ తేజ్‌వెల్)
యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ ఫ్లో
ఉత్తమ యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్ ఇన్ ది షాడో ఆఫ్ ది సైప్రెస్
ఉత్తమ మేకప్, హెయిల్‌స్టైల్ ది సబ్‌స్టాన్స్

# సీఎం రేవంత్‌కు పదవీ గండం

## అందుకే తెలంగాణకు మీనాక్షి నటరాజన్

బీజేఎల్ పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు





**మహా :** రాష్ట్రానికి త్వరలోనే కొత్త ముఖ్యమంత్రి రాబోతున్నారని, అందులో బాగంగానే టీపీసీసీకి కొత్త ఇంచార్జీని రాహుల్ గాంధీ నియమించారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం తన నివాసంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్ ను నియమించడం వెనుక రాహుల్ వ్యూహాత్మకంగా వ్యవహరించారన్నారు. సీఎంను మార్చేందుకు కావాల్సిన గ్రౌండ్ ను ప్రిపేర్ చేసుకోవడంతో ప్రస్తుతం మీనాక్షి నటరాజన్ నిమగ్నమయ్యారన్నారు. సీఎం పీఠం కోసం ప్రస్తుత మంత్రివర్గంలోని ముగ్గురు పోటీ పడుతున్నారని వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఎవరికి వారు అధిష్టానం వద్ద తమ పలుకుబడిని ఉపయోగిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి పూర్తి అభద్రతా భావంతో ఉన్నారని, అందుకే పాలనపైన పూర్తి స్థాయి పట్టును సాధించలేకపోతున్నారన్నారు. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం విశ్వసించడం లేదని, అందుక రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డికి అపాయింట్ మెంట్ కుడా ఇవ్వడం లేదన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్ళినప్పుడల్లా ప్రధాన మంత్రి మోడీని కలుస్తున్నారు కానీ తన స్వంత పార్టీ నేత రాహుల్ అపాయింట్ మెంట్ దొరకడం లేదంటే సీఎం పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. ఎస్ఎల్ బీసీ ప్రమాదం జరిగిన తొమ్మిది రోజులకు సీఎం ఘటనా స్థలికి వెళ్ళడం చూస్తుంటే ఉత్తమ్ శాఖలో జోక్యం చేసుకోలేని పరిస్థితిలో సీఎం ఉన్నారన్న విషయం స్పష్టమైందన్నారు. పొంగులేటి తన శాఖలోని పనులను చేసి పెట్టేందుకు 50 శాతం పీ టాక్స్ కింద వసూలు చేస్తున్నారన్నారు. భూక్రమబద్ధీకరణ విషయంలో పొంగులేటి వసూళ్ళ పర్వాన్ని భారీగా పెంచారన్నారు. అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలతో సీఎం తాను ఏంచేస్తున్నాడో ఏం మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితులల్లో ఉన్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బీసీ కాదని మాట్లాడిన రేవంత్ రెడ్డి తాజాగా మోడీ రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నారని మాట్లాడారంటేనే ఆయన పరిస్థితి ఏంటనేది అర్థమవుతుందన్నారు. ఎస్ఎల్ బీసీ ప్రమాద స్థలిని సందర్శించేందుకు జరిగిన ఆలస్యంపై మాట్లాడిన రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేత కేసీఆర్ వచ్చాడా అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ సరైన విధంగా పని చేయలేదనే ప్రజలు ఈయనను తిరస్కరించి ఇంట్లో కూర్చో బెట్టారన్న విషయాన్ని రేవంత్ మరిచిపోయినట్లున్నారన్నారు. ఎస్ఎల్ బీసీ టన్నల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నేవీ, ఆర్మీ బృందాలను పంపితే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఉన్న పరిచయాలతో వారంతా సకాలంలో వచ్చారని మాట్లాడటం మరీ విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.

# హరీశ్‌రావు దుబాయ్ వెళ్లిన రోజే కేదార్ మరణం

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- హరీశ్‌రావు డిక్షనరీలో అగ్గిపెట్టె, రాజీనామాలు తొలిపదాలు

**హైదరాబాద్, మహా:** మాజీమంత్రి హరీశ్‌రావు దుబాయ్ వెళ్ళిన రోజే తెలుగు సినీ నిర్మాత కేదార్ శెలగంశెట్టి మృతి చెందారని, దీనిపై తమకు అనుమానాలున్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిదాన్నీ సోషల్ మీడియాలో పెట్టే హరీశ్‌రావు దుబాయ్ పర్యటన వివరాలు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. నీ దోస్తు బిడ్డ పెళ్లి 6 వ తేదీన ఉంది.. మరి ఆరో తారీఖు పెళ్ళి ఉంటే నువ్వు 22వ తేదీన ఎందుకు పోయినట్టు అని ప్రశ్నించారు. ఎవని బ్యాండ్ కొట్టనీకి పోయినవ్.. రీల్స్ కూడా చూపియ్యలే.. అని తీవ్ర విమర్శలు చేశారు. హరీశ్‌రావు దుబాయ్ వెళ్లిన రోజే దుబాయ్‌లో కేదార్ చనిపోయారని సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్‌రావుకు శవరాజకీయాలు కొత్త కాదని మండిపడ్డారు. కేదార్ మరణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేపించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి డిమాండ్ చేశారు. నల్లధనాన్ని తెల్లదనంగా మార్చుకోవడానికి రాజకీయ నాయకులు దుబాయ్ వెళ్తారని అన్నారు. లూటీ చేసిన పైసలు దుబాయ్‌లో దాచుకోవడానికి హరీశ్‌రావు దుబాయ్ వెళ్ళారని ఆరోపించారు. ఎలక్షన్లు, కలక్షన్లు ఆయన నినాదమన్నారు. హరీశ్‌రావు డిక్షనరీలో అగ్గిపెట్టె, రాజీనామాలు మొదటి పదాలని సెటైర్లు వేశారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నెంబర్ వన్ అని అన్నారు. కేసీఆర్ కోట్లు ఖర్చు పెట్టాడు కానీ పనిపై చిత్తశుద్ధి లేదని విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌కి చిత్తశుద్ధి ఉంటే ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసేవారని, నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి నాయకులే లేరని అన్నారు. గతంలో ప్రమాదాలు జరిగితే కేసీఆర్ ఎప్పుడైనా వెళ్లారా? అని ప్రశ్నించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం తొడలు కొట్టడానికి బీఆర్ఎస్ నేతలు బయటకు వస్తారని చెప్పారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతిపక్షాలు సహకరించాలని సూచించారు. ఢిల్లీకి సీఎం వెళ్తే ప్రధాని సానుకూలంగా ఉంటున్నారని, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాత్రం తెలంగాణకి ఏమీ రానివ్వడం లేదన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో తెలంగాణ ఊసు లేకుండా చేశారని విమర్శలు చేశారు.

# హైదరాబాద్‌కు సామాజిక కార్యకర్త మేధా పాట్కర్

## పాతబస్తీలో ప్రత్యక్షం.. అప్రమత్తమైన పోలీసులు



**మహా :** ప్రముఖ సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ హఠాత్తుగా హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. పాతబస్తీ ప్రాంతమైన ఓల్డ్ మలక్‌పేట శంకర్ నగర్‌లోని ఒక ఇంటిని ఆమె సందర్శించారు. అయితే మూసీ సుందరీకరణ పనులను ఆమె అడ్డుకుంటారన్న సమాచారంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆమె బస చేసిన ఇంటికి చేరుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని అక్కడ్నుంచి పంపించేశారు. అయితే తాను మరో ఉద్దేశ్యంతో హైదరాబాద్ నగరానికి రాలేదని అన్నారు. కేవలం నగరంలోని తన స్నేహితుడిని కలిసేందుకే ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. అయినా వినిపించుకోని పోలీసులు ఆమెను అక్కడి నుంచి పంపించేశారు.

'నర్మదా బచావో' ఉద్యమంలో మేధా పాట్కర్ కీలక పాత్ర పోషించారు. ఆ ఉద్యమంతోనే ఆమె బాగా ప్రసిద్ధి చెందారు. గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో ప్రవహించే నర్మదా నదిపై డ్యామ్‌ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గిరిజనులు, రైతులు, పర్యావరణవేత్తలు, మానవ హక్కుల కార్యకర్తలు ఉద్యమం చేశారు. దానికి మేదా పాట్కర్ నాయకత్వం వహించారు. 2011లో మేధా పాట్కర్ ఉద్యమానికి బాలీవుడ్ నటుడు ఆమీర్ ఖాన్ మద్దతు ఇవ్వడంతో ఈ ఉద్యమం మరింత ఊపందుకుంది. నర్మద నదిపై భారీ ఆనకట్టల నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ప్రజల మానవ హక్కులను కాపాడటం కోసం ఆమె నర్మదా బచావో ఉద్యమాన్ని నడిపించారు. మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలో నిర్వాసితులుగా మారే వారికి పునరావాసం కోసం ఆందోళనలు చేపట్టారు. మేధా పాట్కర్ అనేక సామాజిక కార్యక్రమాలు సైతం చేపట్టారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం మూసీ సుందరీకరణకు సిద్ధం కాగా ఇక్కడ ప్రభావితమయ్యే పేదల కోసం ఆమె పోరాటం చేస్తారనే సమాచారంతో పోలీసులు అలెర్ట్ అయి ఆమెను పంపించేశారు.

ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక సదస్సుకు మేధా పాట్కర్ సైతం హాజరయ్యారు. పరిశ్రమలకు ఇష్టారీతిన ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడంతో పర్యావరణానికి హాని కలుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నదీజలాలు కూడా కలుషితం అవుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరుల విధ్వంసానికి పాల్పడవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మేధా సూచనలు చేశారు. పర్యావరణానికి నష్టం చేకూర్చే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావడంతో ఆదివాసీలు, నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని ఆమె వాపోయారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డి, మల్క కొమురయ్య విజయం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఎన్నికల్లో మొత్తం 24,135 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 494 ఓట్లు చెల్లనివిగా తేలగా, 23,641 ఓట్లు మాత్రమే గణనలోకి వచ్చాయి. గెలుపొందాలంటే ఏ అభ్యర్థికైనా 11,822 ఓట్లు అవసరమైనప్పటికీ, మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనంతరం ఎవరూ ఆ మార్కును దాటలేదు.

శ్రీపాల్ రెడ్డి 6,700 ఓట్లు, నర్సి రెడ్డి 4,778 ఓట్లు, హర్షవర్ధన్ రెడ్డి 4,421 ఓట్లు, పూల రవీందర్ 3,216 ఓట్లు, సరోత్తం రెడ్డి 2,347 ఓట్లు సాధించారు. ఈ ఫలితాలతో ఏ అభ్యర్థికీ విజయం ఖరారు కాలేదు.

**ఎలిమినేషన్ ప్రక్రియలో కీలక మలుపులు**

ఈ ఎన్నికల్లో పోటీ తీవ్రంగా ఉండటంతో ఎలిమినేషన్ ప్రక్రియ ఎన్నికల గమనాన్ని పూర్తిగా మార్చేసింది. మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీ నుంచి నిష్క్రమించగా, వారి ఓట్లు ప్రధానంగా ముందున్న అభ్యర్థులకు మళ్లాయి. 10వ రౌండ్ అనంతరం ఓట్ల లెక్కింపు ప్రకారం శ్రీపాల్ రెడ్డి 6,090 ఓట్లు, నర్సి రెడ్డి 4,842 ఓట్లు, హర్షవర్ధన్ రెడ్డి 4,451 ఓట్లు, పూల రవీందర్ 3,140 ఓట్లు, సరోత్తం రెడ్డి 2,304 ఓట్లు సాధించారు. ఈ స్థితిలో రెండో ప్రాధాన్యత ఓట్లే విజేతను తేల్చేలా మారాయి.

**తుది రౌండ్ – విజయం శ్రీపాల్ రెడ్డిదే**

చివరి రౌండ్లలో పోటీ ఉత్కంఠగా మారినప్పటికీ, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో శ్రీపాల్ రెడ్డి ఆధిక్యంలో నిలిచారు. అధికారిక గణాంకాల ప్రకారం, ఆయన 12,003 ఓట్లతో విజయం సాధించారు. నర్సి రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డిలు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో లభించిన ఆధిక్యం శ్రీపాల్ రెడ్డికి ఎమ్మెల్సీ పదవిని అందించింది.

**శ్రీపాల్ రెడ్డి గెలుపుపై ఉపాధ్యాయ వర్గాల్లో సంబరాలు**

శ్రీపాల్ రెడ్డి విజయం సాధించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో సంబరాలు మొదలయ్యాయి. పీఆర్టీయూ శ్రేణులు భారీ ఎత్తున విజయోత్సవాలు నిర్వహించాయి. ఉపాధ్యాయుల హక్కుల కోసం పాటుపడతానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. కఠినమైన పోటీలో గెలిచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయన భవిష్యత్తులో ఉపాధ్యాయ ఉద్యమాలకు అంకితంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

# మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయండి

## సీఎం రేవంత్ రెడ్డికి కవిత డెడ్ లైన్

**మహిళా బిల్లు కోసం కాంగ్రెస్ వత్తిడి తేలేదు**

**ఆడపిల్లలకు స్కూటీలు, మహిళలకు రూ. 2500లు వెంటనే ఇవ్వాలని డిమాండ్**



**మహా :** సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డెడ్ లైన్ పెట్టారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను మార్చి 8 లోగా అమలు చేయాలని లేకపోతే ఉద్యమాన్ని మొదలుపెట్టనున్నట్టు హెచ్చరించారు. మహిళల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని కవిత గుర్తుచేశారు. ఎన్నికల్లో మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల సాధనకై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమాన్ని మొదలుపెట్టారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తల నుంచి 10 వేల పోస్టుల కార్డులు సేకరించారు. మహిళల నుంచి సేకరించిన ఆ పోస్టు కార్డులను సీఎం రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత హామీల అమలుపై మహిళా దినోత్సవం (మార్చి 8) లోపు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయకపోతే.. 10 వేల మంది మహిళలు 10 వేల గ్రామాల్లోకి వెళ్తారని.. లక్షలాది పోస్టు కార్డులు తయారు చేసి డైరెక్టుగా సోనియా గాంధీకే పంపిస్తామని కవిత హెచ్చరించారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర లేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. వరంగల్ ఎయిర్పోర్టుకు రాణి రుద్రమాదేవి పేరు పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాము కూడా కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. మరోవైపు.. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనకు.. ఆయన ప్రారంభించిన పెట్రోల్ బంకులకు ఏమాత్రం పోలిక లేదని కవిత ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు కేవలం పదుల సంఖ్యలో మహిళలకు తప్ప.. పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే కార్యక్రమాన్ని వెంటనే మొదలుపెట్టాలని డిమాండ్ చేసిన కవిత.. అప్పుడే ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని కూడా వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# ఇది చారిత్రాత్మక తీర్పు

## ఈ తీర్పు టీచర్లకు, మోదీకి అంకితం

ప్రధాన ప్రతిపక్షం బీజేపీయేనని తేలింది

ఈ తీర్పు బీజేపీ కార్యకర్తల పోరాటాలకు భరోసా కల్పించింది

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కైనా బీజేపీని ఓడించేందుకు ప్రత్యర్థులకు సహకరించాయి

ఆ రెండు పార్టీల చెంప చెల్లుమనేలా తీర్పు ఇచ్చిన టీచర్లకు హ్యాట్సాఫ్

కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇది 3వ విజయం

తెలంగాణలో త్వరలోనే రామరాజ్యం తథ్యం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



**మహా :** కరీంనగర్ నిజామాబాద్ఆదిలాబాద్మెదక్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్యను గెలిపించి ఉపాధ్యాయులు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపట్ల నమ్మకంతోనే ఈ తీర్పు వెలువడిందన్నారు. ఈ తీర్పు టీచర్లకు, మోదీకే అంకితమన్నారు. కరీంనగర్ నిజామాబాద్ఆదిలాబాద్మెదక్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీగా భారీ విజయం సాధించి గెలుపు పత్రాన్ని అందుకున్న మల్క కొమరయ్యను అభినందించేందుకు కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియం వద్దకు వచ్చిన బండి సంజయ్ ఈ సందర్భంగా మల్క కొమరయ్య, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు క్రిష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావులతో కలిసి మీడియాతో మాట్లాడారు. చారిత్రాత్మక తీర్పునిచ్చిన ఉపాధ్యాయులందరికీ వందనాలు. ఇది మామూలు విజయం కాదు. 5 వేల 900 ఓట్ల తేడాతో మల్క కొమరయ్య భారీ విజయం సాధించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపట్ల నమ్మకం, భరోసా ఉంది. దేశవ్యాప్తంగా మేధావి వర్గమంతా మోదీపట్ల నమ్మకంతో ఉన్నారు. ఇటీవల బడ్జెట్ లో ఉద్యోగులకు రూ.12.75 లక్షల దాకా పన్ను మినహాయింపు ఇవ్వడంపట్ల తీర్పు ఇచ్చారు. ఈ తీర్పుతో బీజేపీ కార్యకర్తల్లో ధైర్యం వచ్చింది. ఆనాడు కేసీఆర్ మూర్ఖత్వపు పాలనకు వ్యతిరేకంగా ఆనాడు టీచర్ ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డిని గెలిపించారు. 317 జీవోపై బీజేపీ కార్యకర్తలు చేసిన పోరాటాలు, లాఠీఛార్జ్ గుర్తుంచుకుని ఈనాడు మల్క కొమరయ్యను గెలిపించారు. తపస్ అంటే చిన్న సంస్థ అని హేళన చేసిన వారందరి చెంప చెల్లుమన్పించేలా ఈరోజు తీర్పు ఇచ్చారు. ఈ రోజు బీజేపీ కార్యకర్తల, నాయకుల కష్టం ఫలించింది. వారి పూర్తి సమయాన్ని కొమరయ్య విజయం కోసం క్రుషి చేశారు. టీచర్ల సమస్యలపై పోరాడే సత్తా బీజేపీకి, కొమరయ్యకే ఉందని భావించి ఈ భారీ విజయం అందించారు. ఈ విజయం ఉపాధ్యాయులకే అంకితం. మోదీకే అంకితం చేస్తున్నాం. దురదృష్టమేమిటంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ ఉందని తెలిసి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై బీజేపీ అభ్యర్థి కొమరయ్యను ఓడించాలని కుట్రలు చేశారు. ప్రత్యర్థులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేసినా వారి ఆటలను ఉపాధ్యాయులను సాగదీయలేదు. కిషన్ రెడ్డి నాయకత్వంలో ఇది మూడో విజయం. ఆయన ఆధ్వర్యంలో 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు గెలిచాం. ఈరోజు టీచర్ ఎమ్మెల్సీ గెలిచాం. రేపో ఎల్లుండో ప్రకటించబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందనే నమ్మకం మాకుంది. రాబోయే రోజుల్లో రామ రాజ్యం వస్తుందనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. మేమే ప్రధాన ప్రతిపక్షమని విర్రవీగుతున్న బీఆర్ఎస్ కు చెంప చెల్లుమనేలా తీర్పు ఇచ్చారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు హ్యాట్సాఫ్... టీచర్ల సమస్యలపై పోరాడాల్సిన ఉపాధ్యాయ సంఘాలు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న తరుణంలో... తపస్ మాత్రమే టీచర్ల సమస్యలపై పోరాడుతోంది. ఇది గమనించి మద్దతు తెలిపిన ఉపాధ్యాయులకు వందనాలు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరేదొక్కటే. జాతీయవాదంతో ముందుకు సాగుతున్న తపస్ సంఘంలో టీచర్లంతా చేరాలని కోరుతున్నా. బీసీ కులగణన పేరుతో ఒక వర్గానికే కొమ్ము కాస్తోంది. ఒక వర్గం ఓట్ల కోసం ఆ వర్గ అభ్యర్థిని ఉపసంహరించేలా చేసి మైనారిటీలందరినీ ఏకం చేసి బీజేపీ అభ్యర్థిని ఓడించాలని కాంగ్రెస్ కుట్ర చేసింది. అయినప్పటికీ టీచర్లు సరైన గుణపాఠం చెప్పారు. భారీగా చెల్లని ఓట్లు పోలవడం దురదృష్టకరం. దీనివల్ల సమాజంలో తప్పుడు సంకేతాలు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత మేధావి వర్గంపై ఉంది.

**అనంతరం మల్క కొమరయ్య మాట్లాడుతూ....**

బీజేపీ కార్యకర్తలు క్రుషి, తపస్ సహకారంవల్లే నేను ఎమ్మెల్సీగా గెలిచాను. నాపై నమ్మకం ఉంచి ఓటేసిన ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు. 317 జీవోసహా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే నా ముందున్న ప్రధాన ఎజెండా. నా గెలుపుకు సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తోపాటు నాయకులందరికీ క్రుతజ్ఞతలు.

# కేసీఆర్‌తో కిషన్ రెడ్డి కుమ్మక్కు అయ్యారు

## తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

**కేంద్రం సహకరిస్తే తెలంగాణ నెంబర్ వన్ అవుతుంది..**

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



**మహా :** కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్‌తో కిషన్ రెడ్డి కుమ్మక్కు అయ్యారని, అందుకే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ మీద ప్రేమ ఉండొచ్చు.. కానీ అభివృద్ధి విషయంలో కాళ్ళు లాగే పని చేయొద్దని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. కేంద్ర మంత్రిగా ఆరేళ్ళు, అంతకు ముందు కూడా ఢిల్లీలో కీలక భూమిక పోషించిన కరిషన్ రెడ్డి తెలంగాణకు రావాల్సిన నిధులు, అమలవుతున్న పథకాల కోసం కావాల్సిన సహకారంపై చర్చ చేశారా ? అని ప్రశ్నించారు. కేంద్రం తెలంగాణకి ఏం ఇచ్చింది అంటే.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి పదవి ఇచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కేంద్రం సహకరిస్తే తెలంగాణ నెంబర్ వన్ అవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఓటేస్తేనే కిషన్ రెడ్డికి కేంద్ర మంత్రి పదవి దక్కిందని, ఆ మాత్రం కృతజ్ఞత కూడా ఆయనకు లేదన్నారు. తన రహస్య మిత్రుడు కేసీఆర్ సూచనలు, శలహాల మేరకే కిషన్ రెడ్డి తెలంగాణకు ద్రోహం చేసేలా వ్యవహరిస్తున్నారని విరుచుకు పడ్డారు. మూసీ ప్రక్షాళన విషయంలో రాష్ట్ఱ్ట ప్రభుత్వానికి కిషన్ రెడ్డి మద్దతు లేదని, పైగా మూసి ప్రక్షాళన విషయంలో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ట్రిపుల్ ఆర్ వద్దా..? స్కిల్ యూనివర్సిటీ వద్దా..? అని అడిగారు. కేసీఆర్ కులానికి చెందిన రామ్మోహన్ నాయుడిని తెలంగాణకి తీసుకు వచ్చి కేసీఆర్‌ను పొగిడే పనిని కిషన్ రెడ్డి చేయించారన్నారు. ఎయిర్ పోర్టులు ఎవరిస్తారు.. సీఎం రేవంత్ అనేక పర్యాయాలు మోడీని కలిసి అడిగితే ఇచ్చారన్నారు. కిషన్ రెడ్డి.. మీరు తెలంగాణ బిడ్డ కాదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. తాను ఫట్టించుకోకపోగా పట్టించుకుని ముందుకు వెళ్ళాలనుకునే రేవంత్ రెడ్డిని అడ్డుకుంటున్నారని, ఇది శరైన పద్దతి కాదన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న కేసీఆర్, కిషన్ రెడ్డిలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో సరైన విధంగా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డి, మల్క కొమురయ్య విజయం

## కరీంనగర్ లో కమలం.. నల్లగొండలో పిఆర్టీయు

**టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెరొకటి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి హోరాహోరీ.. కాంగ్రెస్, బిజెపి మధ్య టఫ్ ఫైట్

కలవరపరుస్తున్న చెల్లని ఓట్లు .. 40వేల ఓట్లు ఔట్?

పట్టభద్ర ట్రెండ్స్ పై మంత్రి శ్రీధర్ బాబు ఆరా

ఇది చారిత్రాత్మక తీర్పు బండిసంజయ్

నల్లగొండలో ఫలించిన జానారెడ్డి వ్యూహం





**కరీంనగర్, హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం సత్తా చాటింది. మూడు స్థానాల్లో పోటీచేసినా.. కరీంనగర్ టీచర్, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాణించింది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అద్వితీయ విజయం సాధించిన బిజెపి, పట్టభద్ర ఎమ్మెల్సీకి టఫ్ ఫైట్ ఇస్తోంది. ట్రెండ్స్ కాంగ్రెస్, బిజెపి మధ్య హోరాహోరీ పోరును సూచిస్తుండగా, టీచర్ ఎమ్మెల్సీ విజయం బిజెపికి ఊపునిచ్చింది. మల్క కొమరయ్య సంచలన విజయం సాధించి బిజెపికి ఊపునిచ్చారు. బిజెపికి ప్రస్తుతం కౌన్సిల్ లో ఉన్న ఏకైక ప్రాతినిధ్యం కూడా హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీనే. ఇపుడు ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి మరో విజయం లభించింది. మల్క గెలుపుతో కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండిసంజయ్ ఆధ్వర్యంలో సంబురాలు జరిగాయి. పట్టభద్ర కౌంటింగ్ కొనసాగుతుండగా, మంగళవారం రాత్రికి ఫలితం తేలే అవకాశముంది. పట్టభద్ర ఎన్నికల ట్రెండ్స్ పై మంత్రి శ్రీధర్ బాబు ఆరాతీయగా. పోలైన ఓట్లు దాదాపు 40వేల ఓట్లు చెల్లకుండా పోవడం సంచలనంగా మారింది. వీటివల్లే కౌంటింగ్ ఆలస్యమైంది.

### ఫలితాల్లో..

ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ పోరు ఫలితాలు వెలువడ్డాయి. నల్గొండఖమ్మంవరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీగా శ్రీపాల్ రెడ్డి, కరీంనగర్మెదక్నిజామాబాద్ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీగా మల్లా కొమురయ్య గెలుపొందారు. నల్గొండలోని వేర్‌హౌసింగ్ గోదాములో జరిగిన కౌంటింగ్‌లో శ్రీపాల్ రెడ్డి తన ప్రత్యర్థులైన అలుగుబెల్లి నర్సిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డిపై విజయం సాధించారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాలేదు. దీంతో అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డిపై శ్రీపాల్ రెడ్డి గెలుపొందారు. వరంగల్‌ఖమ్మంనల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 24,139 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఇవాళ ఉదయం ఉదయం 8 గంటలకు మొదలైన కౌంటింగ్ ప్రక్రియ రాత్రి 9 గంటలకు ముగిసింది. మొత్తం 25 టేబుళ్లలో కౌంటింగ్ నిర్వహించారు.

### మల్కా కొమురయ్య విజయం

కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీగా మల్లా కొమురయ్య విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో 2,50,106 మంది ఓటు వేయగా బీజేపీ మద్దతున్న కొమురయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ జరిగింది.

### ఉపాధ్యాయుల ఆత్మగౌరవ విజయం

ఈ విజయం ఉపాధ్యాయుల ఆత్మగౌరవమని శ్రీపాల్ రెడ్డి చెప్పారు. ఇది ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇచ్చిన తీర్పు అని తెలిపారు. రాష్ట్రంలో పాఠశాల, ఉన్నతవిద్య కోసం కృషి చేస్తానని, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలపై పోరాడతానని ఆయన ప్రకటించారు. విద్యారంగంలో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా నిలుపేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగా శ్రీపాల్ రెడ్డి విజయానికి మాజీమంత్రి జానారెడ్డి వ్యూహాత్మకతే కారణమన్న చర్చ ఉంది.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐ పాఠాలు

## 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ

కృత్రిమ మేధపై మెక్రోసాఫ్ట్ ఫౌండేషన్ బోధన

500 ప్రభుత్వ పాఠశాలల్లో 50 వేల మంది విద్యార్థులకు శిక్షణ

తెలుగు, ఆంగ్లం తెలిసిన వారితో పాఠాలు

**మహా:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే డిజిటల్ నైపుణ్యాలను పెంచేందుకు తెలంగాణ సర్కారు కృత్రిమ మేధను పరిచయం చేయనుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇటీవల మైక్రోసాఫ్ట్ అడ్వాంటేజ్ ఇండియా(ఏఐ) ఫౌండేషన్ ప్రతినిధులు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా 500 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో విద్యనభ్యసిస్తున్న 50 వేల మంది విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, నిపుణులు పాఠాలు చెప్పనున్నారు. ప్రస్తుతం సర్కారు పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన జరుగుతోంది. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పాఠాలను ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### ఆ జిల్లాల్లో ప్రభుత్వ బడులు ఎంపిక

పాఠశాలల ఎంపిక కోసం ఉన్నతాధికారులు కరీంనగర్ జిల్లాలోని ఉపాధ్యాయుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. రెండు నుంచి ఐదో తరగతి వరకు పిల్లలు తల్లిదండ్రుల స్మార్ట్‌ఫోన్‌లో గేమ్‌లను వేగంగా ఆడుతున్నారు. కామిక్ షోలను చూస్తున్నారు. వీరు ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పాఠాలను సులభంగానే అర్థం చేసుకోగలరని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు అధికారులు కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలలను ప్రాథమికంగా ఎంపిక చేసి, వాటిల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య విద్యార్థుల్లో గ్రహణశక్తి, తెలివితేటల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. హైదరాబాద్ మహా నగర పరిసర ప్రాంతాలు, ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ప్రభుత్వ బడులను ఎంపిక చేశారు.



**తెలుగు, ఆంగ్లం తెలిసిన వారితో పాఠాలు**

ప్రభుత్వ బడులకు వస్తున్న వారిలో 80 శాతం వరకు పేద విద్యార్థులు ఉంటారు. వారిలో సమాచార నైపుణ్యాలను పెంచేందుకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను పరిచయం చేసేందుకు మైక్రోసాఫ్ట్ ఫౌండేషన్ తెలుగు, ఆంగ్లం తెలిసిన వారితో పాఠాలు చెప్పించనుంది. ఆయా విద్యార్థులకు ఏఐ సంబంధించిన అంశాలను వివరించేందుకు వాలంటీర్లను సైతం ప్రోత్సహించనుంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ బడుల్లో ఇప్పటికే వందల మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు విద్యార్థులకు ప్రతి శనివారం యానిమేషన్ గేమ్స్, కోడింగ్ అంశాలను నేర్పిస్తున్నారు. మరికొందరు ఆంగ్ల పదాలను సులువుగా నేర్చుకునేందుకు వస్తువులు, పరికరాలను తెచ్చి చూపిస్తున్నారు. ఈ తరహాలోనే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎంపిక చేసిన స్కూళ్లలో ఏఐపై చిన్నారులకు అవగాహన కల్పించనున్నామని విద్యాశాఖ అధికారులు వివరించారు.

# మామిడి సీజన్‌తో సమస్యలు లేకుండా చూస్తం

- **రైతుల ప్రయోజనాలే మాకు ముఖ్యం**
- **మామిడి సీజన్ సన్నాహక సమావేశంలో గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి**

**అబ్దుల్లాపూర్ మెట్, మహా:** మామిడి సీజన్లో మార్కెట్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి అన్నారు. బాటసింగారం మార్కెట్ కార్యాలయంలో సోమవారం మామిడి సీజన్ పై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మామిడి వ్యాపారస్తులు, సంబంధిత అన్ని శాఖల అధికారులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు. వ్యాపారస్తులు కొందరు మాట్లాడుతూ.. సీజన్లో మార్కెట్లో చాలా సమస్యలను ఎదుర్కొంటుమని సమావేశంలో వివరించారు. సమస్యలపై అధికారులు, పాలకవర్గం వెంటనే స్పందించి.. కొన్నింటికి వెంటనే పరిష్కారిస్తామని అన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్రెడ్డి మాట్లాడుతూ... మామిడి సీజన్లో మార్కెట్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. దేశంలోనే అతిపెద్ద మామిడి దిగుమతులు ఎగుమతులు బాటసింగారం పండ్ల మార్కెట్ లో జరుగుతాయన్నారు. ఈ సీజన్లో ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. రైతులు, వ్యాపారులు, అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. మార్కెట్ మౌలిక వసతులు కల్పిస్తామని.. అలాగే రైతులకు విశ్రాంతి, వైద్య సేవలు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ వంటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఎప్పుడు లేని విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడతున్నామని అన్నారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఒక కుటుంబం లాంటిదని.. ఎక్కడ సమస్య ఉన్న దగ్గరుండి పరిష్కరిస్తామన్నారు. అధిక కమీషన్లు వసూలు చేస్తే మార్కెట్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జీ గట్టుమల్లు, హయత్నగర్ ఫైర్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి, మార్కెట్ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, రఘుపతి రెడ్డి, జైపాల్ రెడ్డి, అంజయ్య, లక్ష్మి, నరసింహ, గోవర్ధన్ రెడ్డి, నవరాజ్, గణేశ్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ కమిటీ అధికారులు, పలువురు వ్యాపారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం

# తెలంగాణ హైకోర్టులో పిల్

- **పిల్ దాఖలు చేసిన నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్**
- **ప్రమాదం జరిగి పది రోజులవుతున్నా కార్మికుల ఆచూకీ లేదని వెల్లడి**
- **ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి**

**మహా :** ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా తీసుకురావాలంటూ నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్ పిల్‌ను దాఖలు చేసింది. ప్రమాదం జరిగి పది రోజులవుతున్నప్పటికీ కార్మికుల ఆచూకీ లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. తెలంగాణ ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. టన్నెల్ సహాయక చర్యల్లో ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీం, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొంటున్నట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరవై నాలుగు గంటలు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సహాయక చర్యలను ప్రభుత్వం పరిశీలిస్తోందని కోర్టుకు తెలిపారు. అడ్వొకేట్ జనరల్ తెలిపిన వివరాలను నమోదు చేసిన హైకోర్టు పిల్‌పై విచారణను ముగించింది.

EDITORIAL
సంపాదకీయం

# కృష్ణం వందే జగద్గురుమ్ !

## లివ్ అండ్ లెట్ లివ్ !!





- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

**కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ వైఖరి, నిర్ణయాలు 'కర్మల భారం' గా తెలంగాణ ప్రజలు భావించాలి. ఆయన ఏపీకి మేలు చేసినా అందులో ఏదో 'అంతరార్థం' ఉందని అనుకునే వాళ్ళు,తెలంగాణకు 'బాపు' అన్యాయం చేయరని గట్టిగా నమ్మేవాళ్ళు కూడా లెఖ్ఖ లేనంతమంది ఉన్నారు.కానీ వాస్తవాలు వేరు.**

''ఒక మనిషి తన జీవితంలోని ప్రతీ దశలోనూ విజయాన్ని సాధించడం అంత తేలికైన పని కాదు.కానీ నిర్వహించిన ప్రతి బాధ్యతలోనూ తనదైన ముద్ర వేసుకున్నాడు శ్రీకృష్ణుడు.శ్రీకృష్ణుని లీలలు ఒక ఎత్తైతే, ఆయన పరిణతి మరో ఎత్తు.కృష్ణుడు అంతఃపురంలోని పట్టుపరుపుల మీద జన్మించలేదు.కష్టాలతోనో పుట్టామని బాధపడేవారికి కృష్ణుని బాల్యం ఒక ఊరట. కృష్ణుడు లేని కురుక్షేత్రాన్ని ఎలా ఊహించగలం. కౌరవపాండవుల మధ్య యుద్ధం అనివార్యం అని తెలిసి కూడా తన వంతుగా సంధికి ప్రయత్నించాడు. రాయబారిగా యుద్ధాన్ని నిలువరించలేనప్పుడు రథసారథిగా అర్జునుడికి మార్గనిర్దేశం చేస్తాడు.సమస్త కర్మల భారాన్నీ తన యందు ఉంచి నిర్భయంగా యుద్ధం చేయి అని అర్జునుడికి ఉపదేశం చేశాడు. శ్రీకృష్ణుడు భగవంతుడే కాదు,విజయవంతమైన జీవితానికి ఉదాహరణ కూడా''! కేసీఆర్ కు ముమ్మాటికీ ఇదంతా వర్తిస్తుంది.ఆయన ఏమి చేసినా 'లోక కళ్యాణం' కోసమేనని నమ్మేవాళ్ళు కోకొల్లలు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ వైఖరి,నిర్ణయాలు 'కర్మల భారం' గా తెలంగాణ ప్రజలు భావించాలి. ఆయన ఏపీకి మేలు చేసినా అందులో ఏదో 'అంతరార్థం' ఉందని అనుకునే వాళ్ళు,తెలంగాణకు 'బాపు' అన్యాయం చేయరని గట్టిగా నమ్మేవాళ్ళు కూడా లెఖ్ఖ లేనంతమంది ఉన్నారు.కానీ వాస్తవాలు వేరు.

> తెలంగాణవాదమే 'పెట్టుబడి'గా నిర్మించిన టిఆర్ఎస్ పార్టీ నినాదం నీళ్లు - నిధులు - నియామకాలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ఇరుగు,పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం,ఆ రాష్ట్రాల ప్రయోజనాలు కూడా నెరవేరేలా చూడగలగడం,తాను గొప్ప రాజనీతిని ప్రదర్శిస్తున్నట్టు ప్రచారం కేసీఆర్ కు మాత్రమే చెల్లింది.ఆయన నిర్ణయాలతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలుగుతుందా?లేదా?అనే ప్రశ్నలకు జవాబు లేదు.పైగా ఆ ప్రశ్న అడిగితే కేసీఆర్ దబాయింపు వ్యాఖ్యలతో మన నోరు తక్షణం మూయించగలరు!!

"గోదావరి నది నుంచి ప్రతీ ఏటా 3,500 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రం గరిష్టంగా 700800 టిఎంసిలు మాత్రమే వాడుకోగలదు.మిగతా నీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాడుకునే వీలుంది.ప్రకాశం బ్యారేజి ద్వారా సోమశిల వరకు గ్రావిటీ ద్వారానే గోదావరి నీటిని పంపించవచ్చు. దీంతో యావత్ రాయలసీమను సస్యశ్యామలం చేయవచ్చు.కేవలం రెండు లిఫ్టులతో గోదావరి నీళ్లను రాయలసీమకు పంపించవచ్చు.ఇరుగు పొరుగు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించడం మంచిదని నాభావన. నేను స్వయంగా మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిశాను.దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర మధ్య ఉన్న జల వివాదాలను పరిష్కరించుకున్నాం. లివ్ అండ్ లెట్ లివ్ మా విధానం.ఆంధ్రప్రదేశ్ తో కూడా ఇలాంటి సంబంధాలనే కొనసాగించాలన్నది మా విధానం''.అని 2019 లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్,నాటి ప్రగతిభవన్ లో వై.ఎస్.జగన్ తో అన్నారు.

తెలంగాణవాదమే 'పెట్టుబడి'గా నిర్మించిన టిఆర్ఎస్ పార్టీ నినాదం నీళ్లు నిధులు నియామకాలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ఇరుగు,పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం,ఆ రాష్ట్రాల ప్రయోజనాలు కూడా నెరవేరేలా చూడగలగడం,తాను గొప్ప రాజనీతిని ప్రదర్శిస్తున్నట్టు ప్రచారం కేసీఆర్ కు మాత్రమే చెల్లింది.ఆయన నిర్ణయాలతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలుగుతుందా ?లేదా?అనే ప్రశ్నలకు జవాబు లేదు.పైగా ఆ ప్రశ్న అడిగితే కేసీఆర్ దబాయింపు వ్యాఖ్యలతో మన నోరు తక్షణం మూయించగలరు!! కేసీఆర్ హృదయమూ ,ఆలోచనలూ అన్నీ విశాలమైనవి.ఆయన 'కురచ' బుద్ధితో నిర్ణయాలు తీసుకోరని తెలంగాణ ప్రజలు గట్టిగా నమ్మారు.'లంకలో పుట్టిన వాళ్లంతా రాక్షసులు' అన్నది 20012014 సీజన్ కు చెందిన భావోద్వేగ నింద.

గోదావరి,కృష్ణా నదీ జలాలను సమర్థంగా వినియోగించుకుంటే రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయని అప్పట్లో 'జ్ఞాని' కేసీఆర్ చెప్పారు. ''తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ఔదార్యాన్ని చూపుతున్నారు. ఆయనకు ధన్యవాదాలు.కేసీఆర్ వైఖరిని ఏపీలోని అన్ని రాజకీయశక్తులు అభినందనలు.కృష్ణా ఆయకట్టు, రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్ తో మాట్లాడాను. గోదావరి నీళ్లను కృష్ణా నదికి అనుసంధానం చేయడానికి తగిన చర్యలు తీసుకోబోతున్నాం''.అని ఏపీ అసెంబ్లీలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ బహిరంగంగా చెప్పారు.''తెలంగాణ సరిహద్దుల్లో నుంచి నీటిని తరలించుకొని పోయేందుకు కేసీఆర్ అనుమతించారు'' అని కూడా జగన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

''ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాటాకు మించి కృష్ణా జలాలను వాడుకుంటోంది.సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నాయి.తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్కు పట్టవు.రేవంత్ కు ఏపీ సీఎం చంద్రబాబును అడిగే దమ్ము లేదు.రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. రేవంత్ రెడ్డి,చంద్రబాబు నాయుడుకు రేవంత్ గురుదక్షిణ చెల్లించుకుంటున్నాడు. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి.అవసరమైతే అఖిల పక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి''అని ఇరిగేషన్ మాజీ మంత్రి హరీశ్ రావు ఇటీవల అన్నారు.కృష్ణా జలాలు ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించుకుపోవడానికి రేవంత్ అసమర్థత కారణమని కూడా ఆయన నిందించారు.

> 2014 నుంచి శ్రీశైలం నుంచి నీటిని తరలించుకుపోయే సామర్థ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెంచుకుంటూ పోయింది. 2005లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 44,000 క్యూసెక్కులు కాగా 2023 నాటికి 92,600 క్యూసెక్కులుగా పెరిగింది. తెలంగాణ అభ్యంతరాలు తెలిపినా,ఆర్ఎల్ఐఎస్ ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లింది.

''పదేళ్లుగా పాలమూరు జిల్లా ఎందుకు నీళ్లు రాలేదు. పాలమూరు ప్రాజెక్టులను కెసిఆర్ ఎందుకు పూర్తి చేయలేదు.పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పడావుపెట్టి కేసీఆర్ పాలమూరు జిల్లాను ఎడారిగా మార్చారు.మక్తల్ నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టుకు అనుమతి తెస్తే నా పై కోపంతో దాన్ని పడావు పెట్టారు.పాలమూరు వలసలు ఆపేందుకు మేం ప్రయత్నిస్తుంటే మమ్మల్ని అడ్డుకుంటున్నారు.ఆనాడు వైఎస్ కు ఊడిగం చేసి కృష్ణా జలాలు సీమకు తరలించుకుపోయేందుకు కెసిఆర్ సహకరించారు.జగన్ మోహన్ రెడ్డి రాయలసీమకు నీళ్లు తరలించుకు పోతుంటే చూస్తూ ఊరుకున్నారు.కేసీఆర్ చేసిన పాపం ఇవాళ రాష్ట్రాన్ని వెంటాడుతుంది నిజం కాదా?పదేళ్లలో సాగునీటి మంత్రులుగా ఉన్నది హరీష్,కెసిఆర్ కాదా? నీళ్లు రాయలసీమ తరలించుకుపోతే,నిధులు కెసిఆర్ కుటుంబం తరలించుకుపోయింది'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదురుదాడి చేశారు.

''జగన్‌తో స్నేహం కారణంగా ఏపీ నీళ్ల దోపిడీని కేసీఆర్ ఏనాడు అడ్డుకోలేదు''మంత్రి ఉత్తమ్ అన్నారు. కృష్ణా జలాల వాటా విషయంలో చాలాకాలంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉంది. ఉమ్మడి ఏపీతోనే తెలంగాణకు తీరని నష్టం జరిగింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు,రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చిన మార్పుల కారణంగా తెలంగాణ ప్రాంతానికి తీరని నష్టం వాటిల్లిందని,బేసిన్‌లోనే ఉన్నా కృష్ణా జలాలు దక్కకుండా పోయాయని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.కృష్ణా బేసిన్‌లోని రాష్ట్రాలు నీళ్ల కోసం అల్లాడుతుంటే,ఏపీ మాత్రం బేసిన్ అవతలికి 323 టీఎంసీలను మళ్లిస్తున్నదని అంటోంది.ఇదే అంశాన్ని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం బలంగా వాదిస్తోంది.

కృష్ణా బేసిన్‌కు సంబంధించి చారిత్రక,భౌగోళిక అంశాలపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం తన వాదనలను కొనసాగిస్తోంది.కృష్ణా పరీవాహక ప్రాంతం,దాని ఉపవాగుల ప్రాధాన్యతలను ప్రభుత్వం వివరించింది.1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్ర సరిహద్దుల్లో వచ్చిన మార్పులను మ్యాప్‌ల సహాయంతో ట్రిబ్యునల్ ఎదుట రేవంత్ ప్రభుత్వం ఉంచింది. తెలంగాణకు సంబంధించి ప్రస్తుతం లిఫ్ట్ ఇరిగేషన్ సీమ్‌ల కింద ప్రతిపాదించిన నీరు,ఆయకట్టుకు వాస్తవానికి తుంగభద్ర డ్యామ్,కృష్ణా నదిపై అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ కాలువలు,భీమా ప్రాజెక్ట్‌ల ద్వారా గ్రావిటీ ద్వారా అందించేందుకు ప్రణాళికలను రూపొందించారని గుర్తుచేశారు.కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఆ ప్రణాళికలను అమలు చేయలేదని,కేవలం నీరు,ఉపాధి ,ఆర్థిక విషయాల్లో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా వ్యవహరించిందని వివరించారు.తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన జలాలు అంతంత మాత్రమేనని తెలంగాణ తరపు న్యాయవాదులు వివరించారు.

బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయిస్తే దాదాపు 25 లక్షల కుటుంబాలు,అంటే దాదాపు 80 లక్షల జనాభాకు జీవనోపాధి లభిస్తుంది. అంతర్రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ జల సూత్రాలకు విరుద్ధంగా కృష్ణా నీటిని ఏపీ తరలించుకుపోతున్నట్టు విమర్శలున్నవి. శాస్త్రీయ పద్ధతులు,నీటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా నీటిని పొదుపు చేయవచ్చని, ఆ పొదుపు జలాలను బేసిన్ ప్రాంతాలకు కేటాయించాలని ట్రిబ్యునల్ ఎదుట రేవంత్ ప్రభుత్వ

> కేసీఆర్ హృదయమూ,ఆలోచనలూ అన్నీ విశాలమైనవి.ఆయన 'కురచ' బుద్ధితో నిర్ణయాలు తీసుకోరని తెలంగాణ ప్రజలు గట్టిగా నమ్మారు.'లంకలో పుట్టిన వాళ్లంతా రాక్షసులు' అన్నది 2001-2014 సీజన్ కు చెందిన భావోద్వేగ నింద.

వాదన. పోలవరం ద్వారా 80 టీఎంసీలు,పట్టిసీమ లిఫ్ట్ ద్వారా సుమారు 100 టీఎంసీలు,చింతలపూడి లిఫ్ట్ ద్వారా 27 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్ బేసిన్ వెలుపలి ప్రాంతాలకు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నది.

75 శాతం డిపెండబిలిటీతో పెన్నా బేసిన్‌లో 98 టీఎంసీలు,గుండ్లకమ్మ సగటు డిపెండబిలిటీతో 195 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. ఈ నేపథ్యంలో బేసిన్ నుంచి వెలుపలికి ఏపీ మళ్లించే జలాలను తెలంగాణకు కేటాయించాలని తెలంగాణ వాదనలు వినిపించింది.కృష్ణా డెల్టా వ్యవస్థ,నాగార్జునసాగర్ కమాండ్ ఏరియాల తగ్గింపు ఫలితంగా నీటి వినియోగం తగ్గుతుందని కూడా వివరించారు. కృష్ణా డెల్టా వ్యవస్థలో 75 టీఎంసీల అదనపు నీరు ఏపీకి అందుబాటులో ఉంటుందని,దానిలో కొంత భాగాన్ని వినియోగించుకుంటున్నదని,దానిని లెకించాల్సిన అవసరముందని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.

కృష్ణా జలాల్లో దాదాపు 323 టీఎంసీలను ఏపీ బేసిన్ అవతలికి మళ్లిస్తున్నదని,బేసిన్ ప్రాంతాలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నాయని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాదులు అంటున్నారు.సరఫరా కంటే బేసిన్ డిమాండ్ ఎకువగా ఉన్నప్పుడు,ఇష్టారాజ్యంగా నీటిని వినియోగించుకునేందుకు ఏపీని అనుమతించవద్దని వాదించారు ట్రిబ్యునల్‌కు గణాంకాలను,మ్యాపులను తెలంగాణ న్యాయవాదులు సమర్పించారు.రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు,రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చిన మార్పుల కారణంగా తెలంగాణ ప్రాంతానికి తీరని నష్టం వాటిల్లింది. బేసిన్‌లోనే ఉన్నా కృష్ణా జలాలు దక్కకుండా పోయాయని తెలంగాణ వాపోతున్నది. బేసిన్‌లోని రాష్ట్రాలు నీళ్ల కోసం అల్లాడుతుంటే,ఏపీ మాత్రం బేసిన్ అవతలికి 323 టీఎంసీలను మళ్లిస్తున్నదని, ఇది వాంఛనీయం కాదని ట్రిబ్యునల్ ఎదుట ప్రభుత్వం తేల్చిచెప్పింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ లో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే.

బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయిస్తే దాదాపు 25 లక్షల కుటుంబాలు,అంటే దాదాపు 80 లక్షల జనాభాకు జీవనోపాధి లభిస్తుందన్నది ప్రభుత్వ వాదన. అంతర్రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ జల సూత్రాలను రేవంత్ ప్రభుత్వం వివరిస్తోంది. ఏపీలో సాగులో ఉన్న వాస్తవ విస్తీర్ణాన్ని తగ్గించడం తమ ఉద్దేశం కాదని స్పష్టంచేశారు.శాస్త్రీయ పద్ధతులు,నీటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా నీటిని పొదుపు చేయవచ్చని,ఆ పొదుపు జలాలను బేసిన్ ప్రాంతాలకు కేటాయించాలని తెలిపారు. అదేవిధంగా పోలవరం ద్వారా 80 టీఎంసీలు,పట్టిసీమ లిఫ్ట్ ద్వారా సుమారు 100 టీఎంసీలు,చింతలపూడి లిఫ్ట్ ద్వారా 27 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్ బేసిన్ వెలుపలి ప్రాంతాలకు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

> కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయిస్తే దాదాపు 25 లక్షల కుటుంబాలు,అంటే దాదాపు 80 లక్షల జనాభాకు జీవనోపాధి లభిస్తుంది. అంతర్రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ జల సూత్రాలకు విరుద్ధంగా కృష్ణా నీటిని ఏపీ తరలించుకుపోతున్నట్టు విమర్శలున్నవి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో 'అలయ్ బలాయ్' చేసుకున్నకేసీఆర్ అండ్ కో అప్పుడే ఉల్లంఘనలపై స్పందించి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి ఉత్పన్నమయి ఉండేది కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. టెలిమెట్రి పరికరాలు అమార్చలని చట్టంలో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ పాలకులకు నీటి దోపిడీలో సహకరించేందుకే కేసీఆర్ ప్రభుత్వం అమర్చలేదని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో నీటిపారుదల రంగాన్ని భ్రష్టు పట్టించినట్టు సీఎం రేవంత్ ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ వ్యవహారంలో అప్రతిష్ట పాలు జేసేందుకు అర్ధం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నట్టు రేవంత్ అంటున్నారు.

'ఆల్ ఇండియా స్టేట్ వాటర్ మినిస్టర్స్ సమావేశం' ఇటీవల రాజస్థాన్ ఉదయపూర్ లో జరిగింది. "తెలంగాణకు జరిగిన అన్యాయంపై తగిన మార్గదర్శకాలు ఇస్తామని కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పటేల్,జలశక్తి కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ హామీ ఇచ్చారు" అని ఆ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాకు తెలిపారు.సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కోసం గోదావరి నది జలాల 67 టీఎంసీ కేటాయింపును వేగవంతం చేయడం జరిగిందని,సమ్మక్క సారక్క ప్రాజెక్ట్ కోసం 44 టీఎంసీ కేటాయింపుకు చర్చలు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశాల మినిట్స్‌ను ఆయన ప్రస్తావించారు. కేఆర్ఎంబీకి కీలక ప్రాజెక్టులను అప్పగించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించిన విధానాన్నిఉత్తమ్ బయటపెట్టారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కోసం టెండర్లను పిలవడానికి వీలుగా ఆపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయడం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతించిందని ఆయన ఆరోపించారు..

2014నుంచి శ్రీశైలం నుంచి నీటిని తరలించుకుపోయే సామర్థ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెంచుకుంటూ పోయింది. 2005లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 44,000 క్యూసెక్కులు కాగా 2023 నాటికి 92,600 క్యూసెక్కులుగా పెరిగింది. తెలంగాణ అభ్యంతరాలు తెలిపినా,ఆర్ఎల్ఐఎస్ ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లింది.వెలిగొండ ప్రాజెక్ట్, ఇతర అనుబంధ పథకాలు ఏపీకి మరింత నీటి మళ్లింపు సామర్థ్యాన్ని కల్పించాయి. తెలంగాణ ప్రాజెక్టులు కల్వకుర్తి,నెట్టంపాడు,పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నీటి కొరతతో పోరాడుతున్నాయి.తెలంగాణ ఎన్నికలకు ఒక రోజు ముందు 2023 నవంబరు 29న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 400500 మంది సాయుధ పోలీసులతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ రైట్ హాఫ్‌ను బలవంతంగా ఆక్రమించుకున్నారు కేఆర్ఎంబీ అనుమతి లేకుండానే 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.ఇది తెలంగాణ హక్కులపై నేరుగా దాడి.అయినా,బీఆర్ఎస్ ప్రభుత్వం తక్షణ చర్య తీసుకోవడంలో విఫలమైందన్న విమర్శలున్నవి. పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్,కల్వకుర్తి, దిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వంటి ప్రాజెక్టులు ఆలస్యానికి గురయ్యాయి.మహబూబ్ నగర్,నల్గొండ,రంగారెడ్డి జిల్లాల్లో రైతులు నీటి కొరత కారణంగా తీవ్రంగా నష్టపోయారు.

> *''తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ఔదార్యాన్ని చూపుతున్నారు. ఆయనకు ధన్యవాదాలు.కృష్ణా ఆయకట్టు, రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు తెలంగాణ సీఎం కేసీఆర్ తో మాట్లాడాను. గోదావరి నీళ్లను కృష్ణా నదికి అనుసంధానం చేయడానికి తగిన చర్యలు తీసుకోబోతున్నాం''.అని ఏపీ అసెంబ్లీలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ బహిరంగంగా చెప్పారు.''తెలంగాణ సరిహద్దుల్లో నుంచి నీటిని తరలించుకొని పోయేందుకు కేసీఆర్ అనుమతించారు'' అని కూడా జగన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.*

> *కృష్ణా జలాల వాటా విషయంలో చాలాకాలంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతూనే ఉంది.ఉమ్మడి ఏపీతోనే తెలంగాణకు తీరని నష్టం జరిగింది.రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు,రాష్ట్రాల సరిహద్దుల్లో వచ్చిన మార్పుల కారణంగా తెలంగాణ ప్రాంతానికి తీరని నష్టం వాటిల్లిందని,బేసిన్‌లోనే ఉన్నా కృష్ణా జలాలు దక్కకుండా పోయాయని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.*

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# మిస్టరీ హత్య కేసును ఛేధించిన పోలీసులు

■ అధికారులకు నగదు పురస్కారం అందించిన సీపీ



**హనుమకొండ, మహా;** గత రెండు సంవత్సరాలు మిస్టరీగా మిగిలిపోయిన కేసును ఛేధించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచన పరకాల ఏసిపి సతీష్‌బాబుతో పాటు శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌లను వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందిస్తూనగదుపురస్కారాలనుఅందజేశారు. **వివరాల్లోకి వెళితే..** రెండు సంవత్సరాల క్రితం పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో జరిగిన ఓ వృద్ధురాలి హత్య కేసులో నిందితులు పట్టుకొవడంలో ఎలాంటి క్లూస్ పరకాల పోలీసులకు లభించకపోవడం తో పాటు పరకాల పోలీస్ స్టేషన్ పలువురు ఇన్‌స్పెక్టర్లు పలుమార్లు బదిలీ కావడంతో ఈ కేసు ఓ మిస్టరీగా నిలిచిపోవడం జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ అప్పంగించడం జరిగింది. దీనితో పరకాల ఏసిపి పర్యవేక్షణ లో ఈ హత్య కేసు దర్యాప్తు చేపట్టిన రంజిత్ కొద్ది రోజుల్లోనే హత్యకు గురైంది శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామస్తురాలిగా గుర్తించడంతో పాటు బంగారు అభరణాల కోసం అదే గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డి హత్య గురైన వృద్ధురాలిని తీసుకవెళ్ళి ధర్మారం గ్రామ శివారులో దారుణంగా హత్య చేసినట్లుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దర్యాప్తులో బయటపటడంతో వృద్ధురాలని హత్య చేసిన రాజిరెడ్డిని గత నెలలో పరకాల పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్ తరలించారు. ఎంతో కాలంగా పెండిరగ్‌లో వుంది పోలీసులకు ఓ సవాలుగా నిలిచిన ఈహత్యకేసును ఛేదించడంలో ప్రతిభ కబరిచిన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ నగదు పురస్కారాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో డిసిపి రవీందర్ పాల్గొన్నారు.

# యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

■ బండలేమూరులో ఏసీపీ మార్నింగ్ వాక్
■ గంజాయి, ఆన్ లైన్ గేమ్స్‌పై యువతకు అవగాహన
■ చిన్నపిల్లలకు తల్లిదండ్రులు సెల్ ఫోన్లు ఇవ్వద్దు
■ 10 సంవత్సరాల పిల్లలు వాహనాలు నడుపుతున్నారు
■ ఇది చట్టరీత్యా నేరం మానవాళికి ప్రమాదకరం
■ ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



**రంగారెడ్డి ప్రతినిధి, మహా:** యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. చెడు వ్యసనాలకు యువత లోను కావద్దన్నారు. గంజాయి, డ్రగ్స్, ఆన్ లైన్ గేమ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. జీవితాలను నాశనం చేసే వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధిలోని బండలేమూరు గ్రామంలో ఏసీపీ ఆదివారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. యువకులు, మహిళలతో చర్చించారు. తమ తమ పిల్లలు ఆడే ఆన్ లైన్ గేమ్ లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లో యువత చెడు మార్గంలో వెళ్లేందుకు గంజాయి, మత్తు పదార్థాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. నేడు గంజాయి బారిన పడిన యువత తన కుటుంబాలకు, వ్యక్తిగత జీవితాన్ని సైతం కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నతనంలోనే గంజాయికి బానిసలు అవుతున్నారు. మరోవైపు ఆన్ లైన్ బెట్టింగ్ ల ద్వారా, గేమ్ ల వల్ల ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్నారని అన్నారు. ఇదే ఆన్ లైన్ గేమ్ లకు అలవాటు పడి మంచాల, రాందాస్ పల్లి, రాయపోల్, మాడుగుల, పోచారం తదితర ప్రాంతాల్లో యువకులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను గుర్తు చేశారు. ఇలాంటి ఘటన వల్ల తమ కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కారణంగా వీటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. మరోవైపు సైబర్ నేరగాల్ల వల్ల సైతం బ్యాంకు ఖాతాలు లూటీ అవుతున్నాయని తెలిపారు. మొదట తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాలను చూపిస్తామని ఆశ చెబుతూ యువతను తమ ఆధీనంలోకి తీసుకుంటారని గుర్తు చేశారు. ఆన్ లైన్ లో తమ అకౌంట్ డీటెయిల్స్ తీసుకొని, ఆన్ లైన్ గేమ్ లను ప్రారంభించే విధంగా ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. తర్వాత వందలు, వేలు, లక్షల రూపాయలు వచ్చేలా చేసిన తర్వాత.. ఆ అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వడం వల్లనే ఆన్ లైన్ గేమ్ లకు అలవాటు పడుతున్నారన్నారు. పుస్తకాలు పట్టాల్సిన చేతులతో సెల్ ఫోన్లు పట్టుకొని గంటల తరబడి గేమ్ లు ఆడుతున్న ఉదంతాలు చూస్తున్నామని, వీటి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని గుర్తు చేశారు. 10 సంవత్సరాల వయసు లేని యువత కూడా వాహనాలు నడుపుతున్నారని, ఇది ప్రమాదకరమన్నారు. తన కళ్ళముందే పదుల సంఖ్యలో చిన్నారులు వాహనాలు నడుపుతూ కనిపిస్తున్నారన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగే చిన్నారులు ప్రాణాలు కోల్పోతే తల్లిదండ్రులకే గర్భశోకం మిగులుతుందని ఆందోళన వెలిబుచ్చారు. ఇది తెలియక చేస్తున్నది కాదని తెలిసి చేసిన తప్పుగా భావించాల్సి ఉంటుందని తల్లిదండ్రులకు సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ప్రమాదాల నుంచి బయటపడేందుకు వీలుంటుందని చెప్పారు. ఒకరు ఇద్దరుకు మించి త్రిబుల్ రైడింగ్ చేయడం నేరమన్నారు. ఆ వైపుగా తల్లిదండ్రులు ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పారు. డ్రగ్స్, గాంజా, తాగుడుకు బానిసలు కాకుండా యువత ఉన్నత స్థానంలో నిలిచేందుకు మార్గాలు అన్వేషించుకోవాలన్నారు. అందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. యువత గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ ప్రచారం వారు చేసుకోవాలన్నారు. రాజకీయ వైశ్యామ్యాలకు యువత వేదిక కాకూడదన్నారు. ఒకసారి కేసుల్లో ఇరికితే తమ జీవితాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎలాంటి పోటీ పరీక్షలకు పోటీ పడకుండా అర్హత కోల్పోతారని చెప్పారు. అలాంటి వాటికి తావివ్వకుండా శాంతి భద్రత పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. ఎలాంటి ఘటనలు జరిగిన తమ దృష్టికి తీసుకురావాలని యువతను కోరారు. అనంతరం ఆయనను మహిళలు, యువకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచాల ఏఎస్ఐ సతీష్ కుమార్, యువత పాల్గొన్నారు.

# సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు రెండు పీజీ సీట్లు



**వరంగల్, మహా ;** వరంగల్ నగరంలోని సంరక్ష సూపర్స్పెషాలిటీ హాస్పిటల్ లో కేంద్ర ప్రభుత్వ మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ డీజీహెచ్ఎస్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ లు ఫ్యామిలీ వెల్ఫేర్ వారిచే ఆర్థోపెడిక్ విభాగంలో రెండు పీజీ కోర్సుల సీట్లు మంజూరు చేసిందని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. వరంగల్ లో సంరక్ష హాస్పిటల్ఆర్థోపెడిక్ విభాగంలో డీఎన్ బీ సీట్లు మంజూరైన ఏకైక హాస్పటల్ సంరక్ష హాస్పిటల్ గుర్తింపు పొందింది. గత ఎనిమిది సంవత్సరాలుగా వైద్య విభాగంలో ఉత్తమ ప్రమాణాలతో వైద్యసేవలు అందించిన సంరక్ష హాస్పిటల్ కు కేంద్ర ప్రభుత్వంచె దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నామని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి డీఎన్ బీ కోర్సులో ప్రవేశం పొందిన డాక్టర్ హిమాలయ గుప్తాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏప్రాన్, స్టెత్ ను బహుకరించారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ కార్యక్రమంలో సంరక్ష హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ దొడ్డ రమేష్, వైస్ చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్రిడ్డి శ్రవణ్ కుమార్, డాక్టర్ అజిత్ మహమ్మద్, డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ సంధ్య, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పోలా నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.


# రోడ్డు పనుల్లో నాణ్యతప్రమాణాలు పాటించాలి

■ రోడ్డు వెడల్పులో అవకతవకలపై తీవ్ర ఆరోపణలు చేసిన కొణతం యాకుబ్ రెడ్డి




**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల్లో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి ఆరోపించారు. పార్టీలకు అతీతంగా రోడ్డు వెడల్పు చేసి, అందరికీ సమన్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పత్రిక విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్ వరకు 40 ఫీట్లు వెడల్పు ఉండాల్సిన రోడ్డు, కొన్నిచోట్ల 2530 ఫీట్లకే పరిమితం కావడం వెనుక రాజకీయ లబ్ధిదారుల హస్తం ఉందని, ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపారస్తుల వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేసి, వారికి అనుకూలంగా రోడ్డు వెడల్పును మార్చారని, వారు ఆరోపించారు. 40 ఫీట్ల వెడల్పుతో ఉండాల్సిన రోడ్డును కొంతవరకు మాత్రమే తగ్గించడంలో ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని అన్నారు. డాంబర్ రోడ్ పనుల్లో నాణ్యత లోపిస్తున్నా, అధికారులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. రోడ్డు వెడల్పులో అవకతవకలు జరిగినట్లయితే, మున్సిపల్ కమిషనర్ సమర్థమైన నిర్ణయం తీసుకోవాలని లేకపోతే, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. రోడ్డు వెడల్పులో కొందరి ప్రయోజనాల కోసం మాత్రమే మార్పులు చేస్తే, ఇది ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంటుందని, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో తక్కువ నాణ్యతతో రోడ్లు వేయడం, అధికారుల మౌనం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోందన్నారు. ఈ అంశంపై కమిషనర్ ఏరకంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. అని అన్నారు,

# వాటర్ ప్లాంట్ నిర్మాణం కొరకు ఆర్థిక సాయం చేసిన ఆగమాటి రామ్ రెడ్డి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కొండాపురం వాటర్ ప్లాంట్ నిర్మాణం కొరకు 50,000 వేల ఆర్థిక సాయం అందించిన ప్రముఖ వ్యాపారవేత్త ఆగమాటి రామ్ రెడ్డి, ఇటీవల మున్సిపాలిటీ పరిధి కొండాపురం 9వ వార్డ్ ఏరియాలో మంచినీటి సమస్య ఉందని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలియజేయగా వెంటనే స్పందించి 50,000/ రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, పైళ్ల నర్సిరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త బిట్ల బాబు, టౌన్ కాంగ్రెస్ నాయకులు కారుపోతుల వెంకన్న గౌడ్, నీల వెంకటేష్, బీసు శ్రీనివాస్, బీసు రవి,మన్నే వెంకటేష్(శాంతి ) బీసు ప్రశాంత్,మన్నే సత్యనారాయణ, బండారు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక ఆత్మహత్య



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అగస్త్య ఆసుపత్రి భవనంలో ఓ మహిళా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. మృతురాలు విజయవాడకు చెందిన మైనర్ బలికగా గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఆమె సోషల్ మీడియా ద్వారా మోత్కూర్‌కు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడి, సంబంధం కొనసాగించినట్టు తెలుస్తోంది. అబ్బాయి తల్లి దండ్రులు వివాహానికి ఒప్పుకోకపోవడంతో ఆరెగూడెం రోడ్డులో అగస్త్య హాస్పిటల్ పైన రూము రెంటుకు తీసుకొని, నెల రోజులుగా సహజీవనం చేస్తున్నట్లుగా తెలుస్తుంది. ఈ నేపథ్యంలో, ఆదివారం మధ్యాహ్నం యువతి గదిలో ఒంటరిగా ఉండగా, ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడడంతో, పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రేమ వ్యవహారం వికటించడంతోననే ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు మైనర్ కావడంతో, ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నట్లు ఎస్ ఐ డి నాగరాజు తెలిపారు.

# మరుగుదొడ్ల లేక మహిళల ఇబ్బందులు




**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూ గోర్ మున్సిపాలిటీలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. మరుగుదొడ్లు లేక మహిళలు, ప్రయాణికులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు లేక మహిళల ఇబ్బందులపై గతంలో పలు వార్తా కథనాల ద్వారా కూడా ఈ సమస్యను బహిర్గతం చేసినప్పటికీ, అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. ముఖ్యంగా పోతాయి గడ్డ, అంబేద్కర్ చౌరస్తా, ఎస్బిఐ బ్యాంక్, చెరువుకట్ట ప్రాంతాల్లో ఈ సమస్యతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువుకట్ట ప్రాంతంలో అడ్డగూడూరు, తిరుమలగిరి, తొర్రూరు పట్టణాలకు వెళ్లేందుకు ప్రధాన కూడలి. బస్సుల కోసం, వేచి ఉండే ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఓ స్వచ్ఛంద సంస్థ చెరువుకట్ట, ఎమ్మార్వో కార్యాలయం, వలిగొండ, భువనగిరి రోడ్డులో మరుగుదొడ్లు నిర్మించినా, వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి వాడుకకు అసాధ్యంగా మారాయి. వాటర్ సప్లై లేకపోవడంతో సంవత్సరాలుగా మూతపడ్డాయి. ఈ ప్రాంతంలో చిరు వ్యాపారస్తులు ఎక్కువ, చిరు వ్యాపారాలు చేస్తున్న మహిళలు మరుగుదొడ్లు లేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. గంటలతరబడి వ్యాపారం చేస్తూ, మరుగుదొడ్లు లేక అసౌకర్యానికి లోనవుతున్నామని వారు చెబుతున్నారు. ఎస్బిఐ బ్యాంకు ప్రాంతంలో బ్యాంకింగ్ లావాదేవీల కోసం వచ్చిన మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు శరీరాన్ని అనుకూలించుకునేలా తాగునీటి వినియోగాన్ని తగ్గిస్తున్నారని, దీని వల్ల మూత్రసంబంధ సమస్యలు, యూరినరీ ఇన్ఫెక్షన్లు, కిడ్నీ సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. మున్సిపాలిటీలో మహిళలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిర్మించిన మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించి, నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు. ఎస్బిఐ బ్యాంక్ సమీపంలో, అంబేద్కర్ చౌరస్తా లో కొత్త మరుగుదొడ్లు నిర్మించాలని ప్రయాణికులు, వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా అధికారుల వైఖరిలో మార్పు రానిదే ఈ సమస్య పరిష్కారం కాదు అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసు లో పట్టుబడిన 73 మంది మందుబాబులు

**వరంగల్, మహా ;** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి లో వరంగల్ పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, గ్రేటర్ వరంగల్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ పర్యవేక్షణ లో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసు లో పట్టుబడిన 73 మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా R1 పెద్దూరి సతీష్ s/o యాదగిరి, age.48,వృత్తి. కూలీ r/o వర్ధన్నపేట, వరంగల్ R2 మొహమ్మద్ జావిద్ పాషా s/o గౌస్ మియా , వయస్సు 40 సం. రాలు, వృత్తి. డ్రైవర్ , r/o సంగెం, వరంగల్,లకు (2) రోజుల సామాజిక సేవ శిక్ష పడగా వరంగల్ తహాశీల్దార్ గారి వద్దకు పంపి, మిగత (71) మంది వ్యక్తులకు 73,200/రూపాయల జరిమానా విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన (03) వ్యక్తులను కోర్టులో హాజరు పర్చగా వారికి 1500/ రూపాయల జరిమాన ను విధించడం జరిగిందని వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

# జాతీయ సదస్సు లో పాల్గొన్న మేయర్.. కమిషనర్

■ సిటీస్ 2.0 స్టేట్ లెవల్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ కు ఎంపిక
■ గ్రేటర్ లో అమలుచేస్తున్న విధానాలను ప్యానల్ చర్చ లో వివరించిన మేయర్
■ సర్క్యులర్ ఎకానమీ పై పిపిటి ప్రదర్శన అందించిన కమిషనర్



**వరంగల్, మహా;** రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ లో కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ ఎఫైర్స్ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో రియలైజింగ్ సర్క్యులర్ సొసైటీస్ టు వర్డ్స్ ఎచీవింగ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ ఎస్ డి జి ఎస్ అండ్ కార్బన్ న్యూట్రాలిటీ ఇన్ ఏషియా పసిఫిక్" లక్ష్యం గా రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్ జైపూర్ లో నిర్వహిస్తున్న 12వ రీజనల్ త్రీ ఆర్ అండ్ సర్క్యులర్ ఎకానమీ ఫోరం ఇన్ ఏషియా అండ్ ద పసిఫిక్ జాతీయ సదస్సు లో ముఖ్య అతిథి గా కేంద్ర గృహ నిర్మాణ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ముఖ్య అతిథి గా హాజరై ప్రసంగించిన సమావేశం లో నగర మేయర్ గుండు సుధారాణి సి డి ఎం ఏ డా. టికె శ్రీదేవి బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. సిటీస్ 2.0 స్టేట్ లెవల్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్ లో భాగం గా స్మార్ట్ సిటీ ప్రాజెక్టు లో భాగం గా గత సెప్టెంబర్ నెలలో అందుకు సంబంధించిన సమాచారాన్ని అందజేసిన తరుణం లో రాష్ట్రం ఎంపిక కావడం జరిగిన నేపథ్యం లో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అర్బన్ ఎఫైర్స్ రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ మధ్య ట్రై ప్యాట్ క్రియేట్ అగ్రిమెంట్ కు ఎంపిక కావడం జరిగింది. ఇందుకోసం నగరం లో అమలు చేయనున్న క్లైమేట్ ప్లాన్ కు నిధులు అందజేసే క్రమం లో అగ్రిమెంట్ చేసుకోవడానికి ఆహ్వానం అందడం వల్ల నగరం నుండి మేయర్ తో పాటు రాష్ట్రం నుండి సి డి ఎం ఏ నగర కమిషనర్ హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి హాజరై బల్దియా వ్యాప్తం గా నిర్వహిస్తున్న విధానాలైన రెడ్యూస్ రీయూస్ రీసైక్లింగ్ (3R) విధానాలను నిర్వహిస్తున్న తీరు ఇప్పటివరకూ అమలు చేసిన పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్యానల్ డిస్కషన్ లో మేయర్ మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని స్వచ్ఛ నగరం గా తీర్చిదిద్దడం లక్ష్యం గా ముందుకు సాగుతున్న మని రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యర్థాల సమర్థ నిర్వహణకు ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఇందుకోసం హుజురాబాద్ సమీపం లోని సిర్సాపల్లి వద్ద వ్యర్థాల నుండి పవర్ ఉత్పత్తికి యూనిట్ లు ఏర్పాటు చేయనున్నారని, రాష్ట్ర స్థాయి క్లైమేట్ యాక్షన్ ప్లాన్ ఏర్పాటు లో భాగం గా మున్సిపాలిటీలో క్లైమేట్ సెంటర్ లు ఏర్పాటు చేసి అధికారులు సిబ్బందికి సామర్థ్యాన్ని పెంచేలా శిక్షణను అందజేసి వరదలు రాకుండా క్లైమేట్ ప్లాన్ ను తయారు చేయనున్నట్లు మేయర్ తెలిపారు. యు ఎల్ బి లో 3 ఆర్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సర్క్యులర్ ఎకానమీ అంశం పై జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ 3 ఆర్ రెడ్యూస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నియంత్రణకు ఇన్ఫోఫోర్స్మెంట్ బృందాలను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడం ఇందుకు ప్రత్యామ్నాయం గా జూట్ సంచుల వాడకాన్ని ప్రోత్సహించడం తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చడం రీయుజ్ లో భాగం గా ఆలయాల్లో వినియోగించిన పూల తో దూప్ స్టిక్స్ తయారిని ప్రోత్సహించి ఎస్ హెచ్ జిలకు స్వయం ఉపాధిని కల్పించాం రీ సైక్లింగ్ లో భాగం గా నగరం లో 72 గం. ల్లో చిట్టి పార్కులను ఏర్పాటు చేశాం పొడి చెత్తను తగ్గించడానికి నగర వ్యాప్తం గా 23 డి ఆర్ సి సి కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరించడం తో పాటు రాంపూర్ డంప్ యార్డు లో బయో మిథనైజేషన్ ప్రక్రియ ద్వారా సుమారు 12 ఎకరాల భూమిని అందుబాటు లోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్దియా సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్



**వరంగల్, మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, తో పాటు పాల్గొని ఫిర్యాదులను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు (88) రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కువగా భూ సంబంధిత సమస్యల పై 23 దరఖాస్తులు కలెక్టరేట్ సూపరిడెంట్ 15, జిల్లా వ్యవసాయ శాఖ 11, జిడబ్ల్యూ ఎం 2, డిసి ఎస్ఓ 5 దరఖాస్తులు వచ్చాయని,మిగతావి వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పైన దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించలేని దరఖాస్తులను ఎందుకు పరిష్కరించలేదో కూడా దరఖాస్తుదారునికి తెలుపాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లేని ఏడల వచ్చిన దరఖాస్తు మళ్లీ మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు గ్రీవెన్స్ పోర్టల్ లో ఉన్న వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించవలసిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి వరంగల్,నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, లు, డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, డిపిఓ కల్పన, వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్,సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇంచార్జి, జిల్లా ఇంచార్జి మంత్రితో కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమశాఖా మంత్రి సీతక్కతో కలిసి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ను కలిసారు. మహారాష్ట్ర వార్ధా లోని సేవాగ్రామ్ లో జరిగిన ముఖ్య సమావేశానికి వారు హాజరయ్యారు. తెలంగాణా లో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ నేతలకు సూచించినట్టు తెలుస్తోంది. ఇటు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పార్టీని మరింత పటిష్టస్థితికి చేర్చేలా కృషి చేస్తానని కంది శ్రీనివాస రెడ్డి నేతలకు చెప్పినట్టు తెలిపారు.



# తెలంగాణ ఆర్థిక విజయం

- స్థూల ఉత్పత్తి గణాంకాల్లో కొత్త రికార్డులు.
- రంగారెడ్డి అభివృద్ధి శక్తి – పారిశ్రామిక విస్తరణలో అగ్రస్థానం
- హైదరాబాద్ ఐటీ మహా నగరం – గ్లోబల్ పెట్టుబడిదారులకు హబ్
- మేడ్చల్ వాణిజ్య కేంద్రం – పరిశ్రమల వృద్ధితో ఆర్థిక బలం
- ఖమ్మం సమతుల అభివృద్ధి – వ్యవసాయం, విద్యుత్, పరిశ్రమల పురోగతి




**ఖమ్మం – మహా** తెలంగాణ రాష్ట్ర స్థూల జిల్లా ఉత్పత్తి గణాంకాలు 202223 సంవత్సరానికి విడుదలయ్యాయి. ఈ గణాంకాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్థిక స్థితిని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లాలు స్థూల ఉత్పత్తిలో ముందంజలో నిలిచాయి. మరోవైపు, వ్యవసాయ ఆధారిత, అటవీ ప్రాంతాల్లో ఉన్న జిల్లాలు తక్కువ స్థాయిలో స్థూల ఉత్పత్తిని నమోదు చేశాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు అగ్రస్థానాలను పొందాయి. ఖమ్మం, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాలు అభివృద్ధి చెందుతున్నవిగా గుర్తించబడ్డాయి.

**■ రంగారెడ్డి – తెలంగాణ ఆర్థిక మోటారు**

రంగారెడ్డి జిల్లా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. రూ. 2,83,419 కోట్ల స్థూల ఉత్పత్తితో ఈ జిల్లా రాష్ట్ర ఆర్థిక వ్యూహంలో కీలక పాత్ర పోషిస్తోంది. హైదరాబాద్ నగరానికి సమీపంగా ఉండటం, ఐటీ పరిశ్రమలు, మెట్రో ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ విస్తరణ వంటి అంశాలు రంగారెడ్డి అభివృద్ధికి మద్దతుగా నిలిచాయి. ఈ జిల్లా పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాలు అధికంగా ఉండటంతో భవిష్యత్తులో మరింత పెట్టుబడులను ఆకర్షించే అవకాశముంది.

**■ హైదరాబాద్ – వాణిజ్య, ఐటీ రంగాల ఆధిపత్యం**

హైదరాబాద్ జిల్లా రూ. 2,28,623 కోట్ల స్థూల ఉత్పత్తితో రెండో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఐటీ రంగంలో హైదరాబాద్ టెక్ హబ్ గా గుర్తింపు పొందిన ఈ నగరం, స్టార్టప్‌లు, ఫార్మా పరిశ్రమ, మెట్రో రైలు వంటి ప్రాజెక్టులతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. వాణిజ్య, ఐటీ రంగాల ఆధిపత్యం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో హైదరాబాద్ వాటాను పెంచుతోంది. దేశవ్యాప్తంగా పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలుస్తోంది.

**■ మేడ్చల్ మల్కాజిగిరి – పరిశ్రమల పెరుగుదలతో అభివృద్ధి**

మూడో స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిలిచింది. రూ. 88,867 కోట్ల స్థూల ఉత్పత్తితో ఈ జిల్లా పరిశ్రమల పెరుగుదలలో కీలక పాత్ర పోషిస్తోంది. హైదరాబాద్‌కు అతి సమీపంగా ఉండటంతో రియల్ ఎస్టేట్, ఐటీ కంపెనీలు, వాణిజ్య సంస్థలు ఇక్కడ పెద్దఎత్తున అభివృద్ధి చెందాయి. ప్రైవేట్ రంగ పెట్టుబడులు పెరగడంతో, ఈ జిల్లాలో ఆర్థిక వృద్ధి వేగంగా జరుగుతోంది.

**■ ఖమ్మం – వ్యవసాయ, పారిశ్రామిక రంగాల సమతుల అభివృద్ధి**

ఖమ్మం జిల్లా రూ. 40,803 కోట్ల స్థూల ఉత్పత్తితో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక వృద్ధి ప్రధానంగా జిల్లాకు ఆదాయ వనరులుగా ఉన్నాయి. భద్రాచలం ప్రాజెక్ట్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, టూరిజం అభివృద్ధి ఈ జిల్లా ఆర్థిక స్థితిని మరింత ముందుకు నడిపే అవకాశాలు కల్పిస్తున్నాయి. పెట్టుబడిదరులు మరింతగా ఆకర్షితులై జిల్లాలో పెట్టుబడులు పెడితే, స్థూల ఉత్పత్తి రేటు మరింతగా పెరిగే అవకాశముంది.

**■ నిజామాబాద్ – వ్యవసాయ ఆధారిత పరిశ్రమల పురోగతి**

నిజామాబాద్ జిల్లా రూ. 36,536 కోట్ల స్థూల ఉత్పత్తిని సాధించింది. ప్రధానంగా వ్యవసాయ ప్రాధాన్యత గల ఈ జిల్లాలో సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలను అనుసరించడం, ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల జిల్లాలో వ్యవసాయ మార్కెట్ ఎదుగుతోంది.

**■ భద్రాద్రి కొత్తగూడెం – విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రూ. 34,215 కోట్ల స్థూల ఉత్పత్తితో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తనదైన పాత్రను పోషిస్తోంది. బొగ్గు గనులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఈ జిల్లాలో కీలకంగా ఉన్నాయి. భద్రాచలం టూరిజం, అటవీ ఉత్పత్తులు కూడా జిల్లా ఆదాయాన్ని పెంచుతున్నాయి.

**■ సంగారెడ్డి – మెట్రో పరిసర ప్రగతి**

సంగారెడ్డి జిల్లా రూ. 60,401 కోట్ల స్థూల ఉత్పత్తిని సాధించి అభివృద్ధిలో టాప్5 జిల్లాల్లో నిలిచింది. హైదరాబాద్ సమీపంగా ఉండటంతో, పరిశ్రమలు, మెడికల్, ఇంజినీరింగ్ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నది.

**■ తెలంగాణ ఆర్థిక భవిష్యత్తు – సమగ్ర అభివృద్ధి అవసరం**

ఈ గణాంకాల ప్రకారం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లాలు స్థూల ఉత్పత్తిలో ముందంజలో ఉన్నప్పటికీ, వ్యవసాయ ఆధారిత జిల్లాలు, అటవీ ప్రాంతాలు తక్కువ స్థాయిలో ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తే, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో సమతుల అభివృద్ధి సాధ్యమవుతుంది.

## కష్టపడే వారికి తగిన గుర్తింపు

- కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి సీతక్క



**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారిని తప్పకుండా గుర్తించి వారికి తగిన గౌరవం ఇస్తామని మంత్రి సీతక్క అన్నారు. మహారాష్ట్రలోని వార్ధా సేవాగ్రామ్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆదిలాబాద్‌లోని ప్రజాసేవా భవన్ క్యాంపు కార్యాలయాన్ని మంత్రి సందర్శించారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ....ఇటీవల కాలంలో జరిగిన అన్నీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారందరినీ గుర్తు పెట్టుకుంటామన్నారు. కల్మషం లేకుండా అంకితభావంతో కృషి చేసినవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. నామినేటెడ్ పదవులు కట్టబెట్టి వారికి తగిన గుర్తింపునిచ్చి గౌరవిస్తామన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అవకాశం ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. స్థానిక నేతలు అలాంటివారిని గుర్తించి జాబితా తయారు చేసి అధిష్టానానికి పంపాలన్నారు. పార్టీని నమ్ముకున్నవాళ్లకు చెడు జరగబోదన్నారు. అంతిమంగా విజయం వారినే వరిస్తుందన్నారు. పదవులిస్తేనే పనిచేస్తామనడం సరికాదని, పనిచేసినవారికే పదవులేరుతామని ఆమె స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల్లోనూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. శాంతి, ప్రేమ అనే గాంధీ సిద్ధాంతాన్ని పునికిపుచ్చుకుని రాహుల్‌గాంధీ ఆలోచన విధానంతో కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని అన్నారు. ఆ వెలుగులో...ఆ దారిలో కార్యకర్తలు, నాయకులు పనిచేస్తే మన త్యాగాలను పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని, సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఆత్రం సుగుణ , శ్రీలేఖ ఆదివాసీ,ఉయిక ఇందిరా, నాయకులు బూర్ల శంకరయ్య,సింగిరెడ్డి రామ్ రెడ్డి,మోర ఆశన్న, డేరా కృష్ణ రెడ్డి, గడ్డం అఖిల్ రెడ్డి,గిజ్జ నర్సింగ్,అఫ్రోజ్ అహ్మద్,అశోక్,అజిజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరుగా రైతులకి యూరియా ఎరువుల విక్రయాలు

- ప్రైవేట్ దుకాణాలలో యూరియా అమ్మకాలు లేవు
- బ్లాక్ మార్కెట్ కు అడ్డుకట్ట వేస్తూ సర్కార్ నిర్ణయం
- ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన రైతులు
- డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఎరువులు సరఫరా
- పిఎసిఎస్ సెంటర్ల ద్వారా యూరియా విక్రయాలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు నేరుగా యూరియా విక్రయాలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయానికి పలువురు రైతులు హర్షించారు. ఈ ప్రక్రియ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సరఫరా చేయడం జరుగుతుందని, పిఎసిఎస్ సెంటర్ ద్వారా విక్రయాలు చేపట్టడం జరుగుతుంది. బ్లాక్ మార్కెటును వ్యతిరేకిస్తూ నేరుగా రైతులకి అందించడం సంతోషకరమైన విషయం. రాష్ట్రంలో వరి నాట్లు వేసిన తర్వాత యూరియా అవసరమని గుర్తించి, నేరుగా రైతులకే విక్రయించాలని సర్కార్ పిఎసిఎస్ సెంటర్ల ద్వారా విక్రయాలు చేపట్టింది. ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలకు ఇవ్వకుండా, ప్రభుత్వమే విక్రయాలు చేపట్టడం బ్లాక్ మార్కెట్ ను నియంత్రించేందుకే అని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా యూరియా అమ్మడంతో, వాళ్ల సొంత గోదాములలో ఎరువులను నిలువ చేసి ఇష్టానుసారంగా, దుకాణదారులు అధిక మొత్తంలో ధరలు పెంచడం జరుగుతుంది. దీని ద్వారా రైతులకు పెనుబారంగా, మోయలేని బరువుగా మారింది. వరి నాటిన తర్వాత యూరియా పొలంలో వేయడంతో, పైరు బాగా వచ్చి రైతుకు లాభాలు చేకూరుస్తుందని, పెద్ద మొత్తంలో యూరియా విక్రయాలు జరుగుతుంటాయి. ఇది ఆసరాగా తీసుకున్న దళారులు బ్లాక్ మార్కెట్ ద్వారా, అధిక ధరను పెంచడంతో తప్పని పరిస్థితుల్లో రుసుము వెచ్చించి తీసుకోవాల్సిన పరిస్థితి రైతులకు నెలకొంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని, ఫర్టిలైజర్ దుకాణదారులు చేస్తున్న మోసాలను గుర్తించి, నేరుగా రైతులకే యూరియా విక్రయించాలన్న సదుద్దేశంతో రాష్ట్రంలోని అన్ని పిఎసిఎస్ సెంటర్ల ద్వారా యూరియా విక్రయాలు సోమవారం నుంచి ప్రారంభించింది. మునుముందు రైతులకు ఉపయోగపడే ఫర్టిలైజర్ మరియు ఎరువులను ప్రభుత్వం నేరుగా రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు వారిని కోరారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటి ఆవరణం యందు పిఎసిఎస్ ఉప్పరగూడ ఆధ్వర్యంలో ఎరువులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. రైతులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యూరియా (తత్కాలిక)కొనుగోలు కేంద్రాన్ని, ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు ఆవరణంలో, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, ఏడిఏ వ్యవసాయ శాఖ అధికారి సుజాతతో కలిసి ప్రారంభించడమైనది. నియోజకవర్గంలోని ఫర్టిలైజర్ దుకాణ దారులకు, యూరియా ఎరువులు అందించడం లేదని, ప్రభుత్వం నేరుగా రైతులకు అందించే నిర్ణయం తీసుకుందని, దీనికి సంబంధించి తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సరఫరా చేసిన యూరియాను ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు గోదాంలో నిల్వ చేయడం జరుగుతుంది. అక్కడినుంచి యూరియాను నియోజకవర్గం పరిధిలోని పిఎసిఎస్ సొసైటీలు ఉప్పరిగూడ, పోల్కంపల్లి, దండుమైలారం, యాచారంలోని సెంటర్లకు అందించి ఆయా ప్రాంతాల రైతులకు వీలు ఉండేలా విక్రయాలు చేపట్టడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని విద్యాదరి, ఏఎంసీ వైస్ చైర్మన్ కర్ణాకర్, డైరెక్టర్లు కుమారప్ప, దొంతరమోని రాజు, కరుణాకర్ రెడ్డి, మహేష్ గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పిఎసిఎస్ సీఈవో గణేష్, ఏఈఓ శ్రవణ్, కుమార్, ఏఈఓ శరణ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లాలో పరీక్షలకు హాజరు కానున్న 3793 మంది విద్యార్థులు
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు, మహా :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి 20వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్నాయని, ప్రతీరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు 3793మంది విద్యార్థులు హాజరు కానుండగా, 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు ప్రత్యేకంగా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సూచించారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి చంద్రకళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రామోజీ ఫిలిం సిటీలో ఇంటి స్థలాలకై పోరాటం ఆగదు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** ఇబ్రహీంపట్నం మండలం ముకునూరు గ్రామంలో రామోజీ ఫిల్మ్ సిటీ ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఏర్పాటు. రామోజీ ఫిలిం సిటీలో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను ఇచ్చేంతవరకు తమ పోరాటం ఆగదని సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పి జగన్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం, ముకునూరు గ్రామంలో రామోజీ ఫిలిం సిటీ ఇంటి స్థలాల పోరాట కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 17 ఏళ్లుగా ఇంటి స్థలాల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని, ఇంకా ప్రజల ఓపికను పరీక్షించాలనుకుంటే అధికారులకు, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. 2007 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే మస్క నరసింహ హయాంలో 670 మంది పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇల్లు కట్టుకోవడానికి ప్రొసిడింగ్స్ కూడా ఇచ్చారని, దివంగత ముఖ్యమంత్రి మరణం తర్వాత ఇంటి పట్టాలను అధికారులు తిరిగి తీసుకున్నారన్నారు. ఇంటి స్థలాలను రామోజీ యాజమాన్యం కబ్జా చేసిన, పట్టించుకోకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయన అన్నారు. అధికారులు, ప్రభుత్వం రామోజీ యాజమాన్యానికి లొంగిపోయారన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తే సహించేది లేదని, వెంటనే లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలను ఇవ్వాలని, లేనిపక్షంలో త్వరలోనే లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాలను సీపీఎం నాయకత్వంలో స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పది మంది సభ్యులతో కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం ఓ.కృష్ణ, పాశం సువర్ణ, ఎన్. సంతోష, సత్తమ్మ, పద్మ, యాదమ్మ, ఇందిరమ్మ, హబీబా, స్వరూప, అండాలు మరికొంత సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

## గురుకుల విద్యార్థినీల ప్రతిభకు నగదు ప్రోత్సాహ బహుమతి



**హుజూర్ నగర్,మార్చ్ 3 మహా:** మఠంపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీలకు మార్చి నెలలో జరిగే వార్షిక పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి ప్రోత్సాహం కింద 5,000 రూపాయల నగదు బహుమతినియం. ప్రభాకర్ ప్రకటించారు. దానికి సంబంధించిన చెక్కును బిఅర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పెండిపోలు రామచంద్రయ్య సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ప్రేండిపోలు రామచంద్రయ్య బహుమతి ప్రకటించిన ప్రభాకర్ ను అభినందించారు.

## ఓట్ల అవకతవకలపై సర్వే నిర్వహించిన జిల్లా పంచాయతీ రాజ్ అధికారి



**హుజూర్ నగర్ మార్చి 03మహా:** మఠంపల్లి మండలం చెన్నై పాలెం, క్రింది తండ గ్రామపంచాయతీల ఓట్ల అవకతవకలపై జిల్లా పంచాయతీరాజ్ అధికారి నారాయణ రెడ్డి మరియు ఎంపీడీవో జగదీష్ కుమార్ కలిసి పంచాయతీరాజ్ కార్యాలయంకు సంబంధించిన అధికారులతో క్రింది తండా గ్రామపంచాయతీలో డోర్ టు డోర్ తిరిగి సర్వే చేశారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**వరంగల్, మహా;** వరంగల్ ఎనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 కు చెందిన చెట్టుపల్లి రమాదేవి భర్త రమేష్ ఆదివారం సాయంత్రం తన ఇంటికి తాళం వేసి తన మనవరాలి పుట్టి వెంట్రుకల కోసం వేములవాడ దేవస్థానానికి వెళ్లగా రాత్రి గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువా లో ఉన్న నగదు 18,000 వేల రూపాయలు దొంగలించుకొని పోయినారని చెట్టుపల్లి రమాదేవి ఎనుమాముల స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఇన్స్పెక్టర్ ఏ రాఘవేందర్ తెలిపారు.




# ఈసారి బ్యాడ్ న్యూస్ కాగ్నిజెంట్ ఉద్యోగులకు..

దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఇటీవల వేతన పెంపును 58 శాతం మధ్య ప్రకటించి ఉద్యోగులను నిరాశ పరిచింది. టీఈఎస్‌లో కూడా శాలరీ హైక్ శాతం సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందన్న నివేదికలు వచ్చాయి. తాజాగా మరో మల్టీ నేషనల్ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కూడా ఉద్యోగులకు బ్యాడ్ న్యూసే చెప్పింది.

**వేతన పెంపు వాయిదా**

ఇటీవల జరిగిన టౌన్ హాల్ సమావేశంలో కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్ ఎస్ ఉద్యోగులనుద్దేశించి మాట్లడుతూ బోనస్‌లు, జీతాల పెంపు ఆలస్యంతో సహా కంపెనీ వేతన పెంపు ప్రణాళికలపై అప్‌డేట్స్ ఇచ్చారు. ఏప్రిల్‌లో అమలు జరగాల్సిన జీతాల పెంపును ఆగస్టుకు వాయిదా వేయడంపై ఉద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిని అంగీకరించారు. అయితే వాగ్దానం చేసిన పెంపుదలను గౌరవించడానికి కంపెనీ కట్టుబడి ఉందని ఆయన ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కంపెనీ ఆర్థిక లక్ష్యాలు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా జాప్యం ఒక వ్యూహాత్మక నిర్ణయం అని పేర్కొన్నారు.

**వేతన ప్రణాళికలు**

బోనస్ స్ట్రక్చర్ గురించి కూడా కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ చర్చించారు. అర్హత కలిగిన ఉద్యోగులు తమ బోనస్‌లను ప్రణాళిక ప్రకారం పొందుతారని ధృవీకరించారు. ఇంటర్నల్ మెమో ప్రకారం మార్చి 10లోగా ఉద్యోగులు తమ బోనస్‌లకు సంబంధించిన ఈ లెటర్లను ఆశించవచ్చు. పనితీరును ప్రతిఫలించడం, పోటీ వేతన ప్యాకేజీలను నిర్వహించడంలో కంపెనీ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు.

**విస్తృత ఆర్థిక నేపథ్యం**

అనిశ్చిత స్థూల ఆర్థిక పరిస్థితులు ఐటీ పరిశ్రమను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో వేతనాల పెంపులో జాప్యం జరుగుతోంది. ఈ సవాళ్లను నావిగేట్ చేస్తూ ఆపరేటింగ్ మార్జిన్లను పెంచడం, ఆఫీస్ స్పేస్‌ను ఆప్టిమైజ్ చేసుకోవడంపై కాగ్నిజెంట్ దృష్టి సారించింది. ప్రతిభను నిలుపుకోవడం, మార్కెట్లో పోటీగా నిలవడం అనే ఉద్దేశంతో కంపెనీ ఈ ప్రయత్నాలను బ్యాలెన్స్ చేస్తోంది.

### ఉద్యోగుల ప్రతిస్పందన

వేతనాల పెంపు ఆలస్యం గురించి ముందుగానే ప్రస్తావించడం ఉద్యోగుల్లో మిశ్రమ స్పందనకు దారితీసింది. కొంతమంది దీనిని అట్రిషన్ తగ్గించడానికి మనోధైర్యాన్ని పెంచే చర్యగా భావిస్తుండగా మరికొందరు అదనపు ఒత్తిడి, వారి ఆర్థిక ప్రణాళికపై పడనున్న ప్రభావం గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ అనిశ్చితి ఉన్నప్పటికీ పారదర్శకత, ఉద్యోగులకు విలువ ఉండేలా చూడటం పట్ల రవికుమార్ నిబద్ధత సానుకూల పరిణామమని నిపుణులు సూచిస్తున్నారు.

# కరూర్ వైశ్యా బ్యాంక్ కొత్త శాఖలు.. ఏపీలో ఎక్కడంటే..

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని పొద్దుటూర్‌తో పాటు తమిళనాడులో కొత్తగా ఆరు శాఖలను ప్రారంభించినట్లు ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ వెల్లడించింది. ఇవి సేవింగ్స్, కరెంట్ అకౌంట్స్, డిపాజిట్లు, రుణాలు తదితర బ్యాంకింగ్ సర్వీసులను సమగ్రంగా అందిస్తాయని బ్యాంక్ తెలిపింది.2024-25లో కొత్తగా 35 శాఖలను ప్రారంభించినట్లు, మొత్తం బ్రాంచీల సంఖ్య 877కి చేరినట్లు వివరించింది. కస్టమర్లకు అనుకూలంగా ఉండేలా తమ మొబైల్ బ్యాంకింగ్ యాప్ కేవీబీ డిలైట్‌ను 150 పైచిలుకు ఫీచర్లతో మెరుగుపర్చినట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ఆఖరు నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపార పరిమాణం రూ. 1,81,993 కోట్లకు చేరింది. తొమ్మిది నెలల కాలానికి నికర లాభం రూ. 1,428 కోట్లుగా నమోదైంది.






### తాత్కాలిక ఉద్యోగాలపై
## పెరుగుతున్న ఆసక్తి

ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్ (తాత్కాలిక, కాంట్రాక్ట్ ఆధారిత, నిర్ణీత పనివేళలు లేని... ఉద్యోగ శ్రేణి) వృద్ధికి ఫార్మల్ స్టాఫింగ్ కంపెనీలు మార్గం సుగమం చేస్తున్నాయి. రెగ్యులర్ ఉద్యోగేతర.. తాత్కాలిక ఉద్యోగాల స్థితిగతుల గురించి ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ (ఐఎస్ఎఫ్) వారి ఫ్లెక్సీ ఎంప్లాయ్‌మెంట్ సోషల్ ఇంపాక్ట్ రిపోర్ట్ 2024 వెల్లడించింది. నివేదిక ప్రకారం ఫ్లెక్సీ ఎంప్లాయ్‌మెంట్ అనేది మహిళలు, యువత తక్కువ నైపుణ్యం కలిగిన కార్మికులతో సహా విభిన్న సమూహాలకు సాధికారత కల్పిస్తోంది. అదే సమయంలో శాశ్వత ఉద్యోగ అవకాశాలకు స్పష్టమైన మార్గాలను అందిస్తుంది..దాదాపు 23% తాత్కాలిక కార్మికులు ఫార్మల్ స్టాఫింగ్ ఇండస్ట్రీ ద్వారా శాశ్వత ఉద్యోగాలకు మళ్లారు. ఫ్లెక్సీ వర్కర్లలో 79% మంది మూడు నెలల పాటు అసైన్‌మెంట్‌లలో ఉన్నారని, 6-12 నెలలు పొడిగించిన కాంట్రాక్టులలో సంవత్సరానికి 40% పెరుగుదల ఉందని నివేదిక వెల్లడించింది. ఈ మార్పు అనువైన ఉపాధిలో ఎక్కువ స్థిరత్వాన్ని సూచిస్తుంది, ఎందుకంటే ఎక్కువ మంది కార్మికులు దీర్ఘకాలిక అసైన్‌మెంట్‌లను పొందుతారు. అదనంగా, ఫ్లెక్సీ వర్క్‌ఫోర్స్‌లో 78% మంది ఆరు నెలలకు మించి కాంట్రాక్ట్‌లలో పాల్గొంటున్నారు. ఇది ఫ్లెక్సీ పనుల దీర్ఘకాలిక ప్రయోజనాలపై పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తుందని నివేదిక తెలిపింది. 60% తాత్కాలిక కార్మికులు సామాజిక భద్రత, సకాలంలో వేతనాలు, వైద్య కవరేజీ వంటి ప్రయోజనాల ద్వారా ఆకర్షితులవుతారని తేల్చింది. ఈ కార్మికులలో 78% మంది తమ ఉద్యోగ పరిస్థితుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.

# నిస్సాన్ మాగ్నైట్ సరికొత్త మైలురాయి

నిస్సాన్ మోటార్ ఇండియా తన పాపులర్ కాంపాక్ట్ ఎస్‌యూవీ నిస్సాన్ మాగ్నైట్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని ప్రకటించింది. స్వచ్ఛమైన, మరింత స్థిరమైన ఇంధన ఎంపికల కోసం భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి అనుగుణంగా ఈ వాహనం ఇప్పుడు పూర్తిగా ఈ20 అనుకూలమైనదిగా మారింది. అదేకాకుండా మాగ్నైట్ అద్భుతమైన ఎగుమతి మైలురాయిని సాధించింది, 2020 లో లాంచ్ అయినప్పటి నుండి 50,000 యూనిట్లను దాటింది.

**ఈ 20 కంపాటబిలిటీ**


నిస్సాన్ మాగ్నైట్ 1.0లీటర్ నేచురల్ ఆస్పిరేటెడ్ బీఆర్ 10 పెట్రోల్ ఇంజన్ ను ఈ20 కంప్లైంట్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇది ఇప్పటికే ఈ20 కంపాటబుల్‌గా ఉన్న 1.0లీటర్ టర్బోఛార్జ్‌డ్ పెట్రోల్ ఇంజిన్ కు జతయింది. 20% ఇథనాల్, 80% గ్యాసోలిన్ కలిగి ఉన్న ఈ20 ఇంధనం.. కర్బన ఉద్గారాలు, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి భారత్ విస్తృత వ్యూహంలో భాగం. న్యాచురల్ ఆస్పిరేటెడ్ ఇంజన్ 71బీహెచ్‌పీ పవర్, 96ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. టర్బోఛార్జ్‌డ్ ఇంజన్ 98బీహెచ్‌పీ పవర్, 160ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. నేచురల్ ఆస్పిరేటెడ్ ఇంజిన్ కోసం ట్రాన్స్మిషన్ ఎంపికలలో 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్, 5స్పీడ్ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్మిషన్ (ఏఎంటీ) ఉన్నాయి. టర్బోఛార్జ్‌డ్ ఇంజన్ ఐదుస్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ లేదా కంటిన్యూయస్ వేరియబుల్ ట్రాన్స్మిషన్ (సీవీటీ)తో లభిస్తుంది.

**ఎగుమతి మైలురాయి**

మాగ్నైట్ విడుదల చేసినప్పటి నుండి 50,000 యూనిట్ల ఎగుమతి మార్కును అధిగమించిందని నిస్సాన్ మోటార్ ఇండియా నివేదించింది. జనవరిలో మాగ్నైట్ లెఫ్ట్‌హ్యాండ్ డ్రైవ్ వేరియంట్‌ను ఎగుమతి చేయడం ప్రారంభించింది. చెన్నైలోని కామరాజర్ పోర్ట్ నుండి లాటిన్ అమెరికన్ మార్కెట్లకు దాదాపు 2,900 యూనిట్లను రవాణా చేసింది. ఫిబ్రవరి నాటికి, లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా, ఆసియా పసిఫిక్ ప్రాంతాలలోని మార్కెట్లకు 10,000 యూనిట్లకు పైగా మాగ్నైట్ ఎగుమతి అయింది.




## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



### అయోధ్య రామమందిరంపై
# ఉగ్రదాడికి ఐఎస్ఐ కుట్ర
## భగ్నం చేసిన భారత్

**గాంధీనగర్:** అయోధ్య రామమందిరంపై ఉగ్రదాడి చేసేందుకు ప్రయత్నించిన పాకిస్థాన్(Pakistan) ఐఎస్ఐ ఉగ్రదాడిని భారత్ భగ్నం చేసింది. గుజరాత్, హర్యానా యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ జాయింట్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా హర్యానాలో ఉగ్రవాది రెహ్మాన్‌ను అరెస్ట్ చేసింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ(ISI)తో సంబంధాలున్న ఉగ్రవాది అబ్దుల్ రెహ్మాన్ హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో పట్టుబడ్డాడు. భద్రతా సంస్థల సమాచారం మేరకు.. ఐఎస్ఐ సంస్థ అబ్దుల్ రెహ్మాన్ ద్వారా అయోధ్య రామ్ మందిరంపై దాడి చేయించేందుకు ప్లాన్ చేసింది. ఉగ్రదాడిలో భాగంగా అబ్దుల్ రెహ్మాన్ రామమందిరంపై రెక్కీ నిర్వహించాడు. సమాచారాన్ని సేకరించి ఐఎస్ఐకి చేరవేర్చాడు. అనంతరం, అబ్దుల్ రెహ్మాన్ ఫైజాబాద్ నుంచి ట్రైన్‌లో మొదట ఫరీదాబాద్ చేరుకున్నాడు. ఫరీబాదాబాద్‌లో హ్యాండ్ గ్రనేడ్‌లను సేకరించాడు. వాటిని తీసుకుని ట్రైన్ ద్వారా అయోధ్య వెళ్లాల్సి ఉంది. అనంతరం ఆ హ్యాండ్ గ్రనేడ్‌తో రామమందిరంపై దాడి చేసేలా ప్లాన్ వేశాడు. అంతకంటే ముందే దేశ భద్రతా సంస్థలు అందించిన సమాచారంతో గుజరాత్ ఏటీఎస్, ఫరీదాబాద్ ఏటీఎస్ స్క్వాడ్ అబ్దుల్ రెహ్మాన్‌ను అదుపులోకి తీసుకున్నాయి. అయోధ్యరామ మందిరంపై ఉగ్రదాడిని భగ్నం చేశాయి.

# డీలిమిటేషన్ హీట్
## యూటర్న్ తీసుకున్న స్టాలిన్

**చెన్నై:** నియోజకవర్గ పునర్వ్యవస్థీకరణపై రాజకీయ దుమారం కొనసాగుతున్న వేళ.. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో కొత్తగా పెళ్లైన జంటలను ఆలస్యంగా పిల్లలను కనాలని సూచించిన ఆయన.. ఇప్పుడు స్టాండ్‌పై యూటర్న్ తీసుకున్నారు. అందుకు నియోజకవర్గాల పునర్విభజన రాజకీయం వేడెక్కడమే కారణం. సోమవారం నాగపట్నంలో డీఎంకే నేత కుటుంబ వివాహ వేడుకకు హాజరైన సీఎం స్టాలిన్ మాట్లాడుతూ..గతంలో కొత్తగా పెళ్లైన వాళ్లను పిల్లల విషయంలో కొంత సమయం తీసుకోవాలని నేనే చెప్పాను. ఫ్యామిలీ ప్లానింగ్ విషయంలో మనం విజయవంతం అయ్యాం కూడా. కానీ, ఇప్పుడు.. నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం కొత్త పాలసీలు తీసుకొస్తున్న వేళ అలా చెప్పను. కొత్తగా పెళ్లైన జంటలు వీలైనంత త్వరగా పిల్లలను కనండి. వాళ్లకు మంచి తమిళ పేర్లు పెట్టండి అని స్టాలిన్ అన్నారు. అయితే.. జనాభా ప్రతిపాదికన కేంద్రం నియోజకవర్గాలను పునర్విభజించబోతోందని స్టాలిన్ చెప్పడం ఇదేం కొత్త కాదు. ఇంతకు ముందూ ఆయన ఇలాగే మాట్లాడారు. అలా జనాభా ప్రకారం చూసుకుంటే.. తమిళనాడుకు 8 స్థానాలు తగ్గే అవకాశం ఉందని.. ఇది మరికొన్ని రాష్ట్రాలపైనా ప్రభావం చూపెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారాయన. దేశ సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే.. కుటుంబ నియంత్రణ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా విజయం సాధించాయని అనుకుంటున్నాయి. రేపు ఒకవేళ జనాభా ప్రతిపాదికన గనుక కేంద్రం నియోజకవర్గాలను



విభజిస్తే.. ఆ రాష్ట్రాలకే తీవ్ర నష్టం అని అంటున్నారాయన. అయితే స్టాలిన్ చేసిన ఈ వ్యాఖ్యలపై బీజేపీ కౌంటర్ ఇచ్చింది. తమిళనాడు సీఎం వ్యాఖ్యలు నిరాశవాదంతో కూడుకున్నవని, నిజాయితీలేని రాజకీయాలకు సంకేతమని బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ చెబుతున్నారు. జనాభాకు తగ్గట్లుగా హక్కులు ఉంటాయా? అని గతంలో మీ మిత్రపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని స్టాలిన్‌ను ఉద్దేశించి కేశవన్ అన్నారు. పాలనాపరమైన వైఫల్యాల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈ డ్రామాలని డీఎంకేపై మండిపడ్డారాయన. మరోవైపు.. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగబోదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదివరకే ఓ ప్రకటన చేశారు.

# సుప్రీం కోర్టులో రణవీర్ అల్లాబాదియాకు ఊరట






**ఢిల్లీ :** తల్లిదండ్రుల గురించి, శృంగారం పైన ప్రశ్నించి వివాదాల్లో చిక్కుకున్న ప్రముఖ యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియాకు సుప్రీం కోర్టులో ఊరట దక్కింది. వివాదాస్పద వ్యాఖ్యలతో ఆగిపోయిన పాడ్ కాస్ట్ 'ది రణ్‌వీర్ షో'తో పాటు ఇతర షోలను తిరిగి ప్రారంభించుకోవడంతో పాటు వాటిని ప్రసారం చేసుకోవచ్చని తెలిపింది. 'ఇండియాస్ గాట్ లాటెంట్' వేదికగా యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దీంతో అల్హాబాదియా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా పలు కేసులు నమోదయ్యాయి. అల్హాబాదియా చేస్తున్న షోలు సైతం ఆగిపోయాయి. అయితే, అల్హాబాదియా తాను ఇంటర్వ్యూలు, షోలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. అంతేకాదు,తాను చేస్తున్న షోలపై సుమారు 280 మంది ఆధారపడ్డారని, షోలు ఆగిపోవడం వల్ల వారికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు ఆ పిటిషన్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. అల్హాబాదియా పిటిషన్‌పై కేంద్రం తరపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా తాను ఉత్సుకతతో అల్హాబాదియా షోను చూశానని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. ఆ షో అసభ్యంగా మాత్రమే కాదు.. వక్రంగా ఉందని వ్యాఖ్యానించారు. హాస్యం, అసభ్యత, వక్రబుద్ధి మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉందని నొక్కి చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం ద్విసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాక్ స్వాతంత్ర్యం ప్రాథమిక హక్కు, అశ్లీలత విషయంలో స్పష్టమైన సరిహద్దు ఉండాలని పునరుద్ఘాటించింది. ఈ సందర్భంగా అల్హాబాదియాకు సుప్రీం కోర్టు చురకలంటించింది. భావప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని, అసభ్య పదజాలం వాడటం హాస్యం కాదని మందలించింది. అల్హాబాదియా షోలు చేసుకోవచ్చని, నైతికంగా, మర్యాద ఉండాలని సూచించింది.


# గంజాయి కేసులో ఐఐటీ బాబా అరెస్ట్!

**జైపూర్:** మహా కుంభమేళాతో దేశం దృష్టిని ఆకర్షించిన ఐఐటీ బాబా అభయ్ సింగ్ మరోసారి వార్తల్లోకి ఎక్కారు. గంజాయి కేసులో తాజాగా ఆయన్ని జైపూర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని స్వయంగా ఐఐటీ బాబానే ధృవీకరించడం విశేషం. ఐఐటీ బాబా సూసైడ్ చేసుకుంటానన్న ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు జైపూర్ షిప్రా పాథ్ పోలీసులు ఓ హోటల్‌లో ఉన్నారనే సమాచారంతో అక్కడికి వెళ్లారు. ఆ టైంలో ఆయన నుంచి గంజాయి సేవిస్తుండడంతో పోలీసులు అదుపులోకి తీన్నారు. ఆయనపై నార్కోటిక్ డ్రగ్స్ &సైకోట్రోపిక్ సబ్‌స్టానెన్స్(NDPS) యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అక్కడి మీడియా కథనాలు ఇచ్చింది. అయితే.. ఆయన అరెస్ట్ ప్రచారం నడుమ అనూహ్యంగా ఆయన తన భక్తుల మధ్య పుట్టినరోజు వేడుకలు చేసుకుంటూ కనిపించారు. దీంతో మీడియా ఆయన్ని అరెస్ట్‌పై ఆరా తీసింది. తాను ఆత్మహత్య చేసుకుంటానన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని అన్నారాయన. అయితే తాను గంజాయి తీసుకున్న మాట వాస్తవమేనని.. అయితే పరిమితితో కూడి గంజాయి ఉండడంతో పోలీసులు బెయిల్ మీద తనను విడుదల చేశారని అన్నారాయన. అయితే తన దృష్టిలో అది గంజాయి కాదని.. ప్రసాదమని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే.. ఓ ప్రైవేట్ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో తనపై దాడి జరిగిందంటూ నోయిడా పీఎస్ వద్ద ఐఐటీ బాబా హడావిడి చేసిన సంగతి తెలిసిందే. చివరకు పోలీసులు ఆయన్ని శాంతపర్చి అక్కడి నుంచి పంపించేశారు. అయితే ఇంటర్వ్యూకు ముందు ఆయనే సదరు ఛానెల్ యాంకర్‌పై దాడి చేశారంటూ ప్రచారం జరగడం గమనార్హం. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదు. ఐఐటీ బాబాగా ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా అభయ్ సింగ్ ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూతో పాపులారిటీ సంపాదించుకున్నారు. హర్యానా చెందిన అభయ్ ఐఐటీ బాంబేలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తిచేసినట్లు చెబుతున్నారు. కొంతకాలం ఓ కార్పొరేట్ సంస్థలో పనిచేసిన ఆయన.. దాన్ని వదిలేశారట. ఆపై కొంతకాలం ఫొటోగ్రఫీ.. అటు నుంచి ఆధ్యాత్మికం వైపు అడుగులు వేశారట.




# అతనితో హీరోయిన్ డేటింగ్..

## ఊహించని విధంగా దొరికేసింది!



బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్ పేరు ఇటీవల తెగ మార్మోగిపోతోంది. కొద్ది రోజుల క్రితమే ఓ పెళ్లిలో సందడి చేసిన ఈ ముద్దుగుమ్మ.. మరోసారి తన బాయ్‌ఫ్రెండ్‌గా భావిస్తోన్న రాహుల్ మోడీతో కనిపించింది. వీరిద్దరు కలిసి జంటగా సన్నిహితుల వివాహ వేడుకలో పాల్గొన్నారు. దీంతో మరోసారి వీరిపై డేటింగ్ రూమర్స్ మొదలయ్యాయి. గతంలోనూ అనిల్ అంబానీ పెళ్లి వేడుకలోనూ జంటగా కనిపించారు. అంతేకాదు పలు ఈవెంట్లలో శ్రద్ధా కపూర్ అతనితో పాటు కనిపించింది. దీంతో వీరిద్దరి డేటింగ్ నిజమేనని బాలీవుడ్‌లో టాక్ తరచుగా వినిపిస్తూనే ఉంది. అయితే తాజాగా శ్రద్ధాకపూర్ మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ముంబయిలో ఓ ఈవెంట్‌కు హాజరైన ఈ ముద్దుగుమ్మ ఫోటోగ్రాఫర్ల చేతికి చిక్కింది. దీంతో ఆమెను తమ కెమెరాల్లో బంధిస్తుండగా తన ఫోన్ కూడా కనిపించింది. ఆ ఫోన్‌లో తన బాయ్‌ఫ్రెండ్‌గా భావిస్తోన్న రాహుల్ మోడీతో దిగిన ఫోటో వాల్‌పేపర్‌గా కనిపించింది. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది చూసిన కొందరు నెటిజన్స్ వీరిద్దరి డేటింగ్ నిజమేనంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా.. ఇక సినిమాల విషయానికొస్తే శ్రద్ధా కపూర్ చివరిసారిగా హారర్ కామెడీ ఫిల్మ్ స్త్రీ- 2లో కనిపించింది. రాజ్ కుమార్ రావు కీలక పాత్రలో కనిపించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో మరో మూడు సినిమాల్లో కనిపించనుంది.




# కేరళకు అల్లు అరవింద్..

## నిర్మాత బన్నీవాసు క్లారిటీ



టాలీవుడ్ నిర్మాత బన్నీ వాసు ఆసక్తికర కామెంట్స్ చేశారు. బాలీవుడ్ సూపర్ హిట్ మూవీ ఛావా తెలుగు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ గురించి ప్రశ్నలు ఎదురయ్యాయి. ఛావాను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ విషయంపై అరవింద్ ఎలా రియాక్ట్ అయ్యారని మీడియా ప్రతినిధులు బన్నీవాసును ప్రశ్నించారు. దీనిపై ఆయన స్పందిస్తూ అల్లు అరవింద్ ప్రస్తుతం కేరళలో ఉన్నారని తెలిపారు. ట్రీట్‌మెంట్ కోసం ఆయన కేరళ వెళ్లారని వెల్లడించారు. అయితే ఆయన కేవలం వెల్‌నెస్ సెంటర్‌లో చికిత్స కోసం వెళ్లారని బన్నీ వాసు అన్నారు. బరువు తగ్గేందుకు ప్రకృతి వైద్య చికిత్స తీసుకుంటున్నారని వెల్లడించారు. ఛావా నిర్మాతలతో మాట్లాడి తెలుగు రిలీజ్ చేసేందుకు ప్రయత్నించాలని అరవింద్ చెప్పారని తెలిపారు. ఆయన డైరెక్షన్‌లోనే ఛావాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా.. బాలీవుడ్ మూవీ ఛావాలో విక్కీ కౌశల్, రష్మిక మందన్నా జంటగా నటించారు. ఈ చిత్రాన్ని శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇందులో శంభాజీ మహారాజ్ విక్కీ కౌశల్, యేసుబాయిగా రష్మిక మందన్నా నటించారు. గతనెల థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలవడంతో తెలుగులో డబ్బింగ్ చేసి విడుదల చేస్తున్నారు.




# ఈవెంట్ తెచ్చిన తంటా..

## రష్మికకు ఎమ్మెల్యే స్ట్రాంగ్ వార్నింగ్


శాండల్‌వుడ్‌లో వివాదం మరింత ముదురుతోంది. ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు కన్నడకు చెందిన అగ్ర సినీతారలు హాజరు కాకపోవడం రాజకీయ రంగు పులుముకుంది. ఈ అంశంపై ఇప్పటికే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అందరికీ నట్లు, బోల్టులు ఎప్పుడు బిగించాలో తమకు తెలుసని మండిపడ్డారు. తాజాగా మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే నేషనల్ క్రష్, పుష్ప భామ రష్మిక మందన్నాపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇటీవల జరిగిన బెంగళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు రష్మిక హాజరు కాకపోవడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గణిగ మండిపడ్డారు. కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో తన కెరీర్‌ను ప్రారంభించిన రష్మిక తన మూలాలు మరిచిపోవడం సరైంది కాదని హితవు పలికారు. గతేడాది కూడా ఈవెంట్‌కు ఆహ్వానించగా నిరాకరించిందని వెల్లడించారు. తాను కెరీర్ ప్రారంభించిన ఇండస్ట్రీని చిన్నచూపు చూస్తున్న రష్మికకు తగిన గుణపాఠం చెప్పకూడదా? అంటూ అని మాండ్యా నియోజకవర్గ ఎమ్మెల్యే రవి గణిగ ప్రశ్నించారు. కాగా.. రష్మిక 2016లో కన్నడ చిత్రం కిరిక్ పార్టీతో రక్షిత్ శెట్టి సరసన సినీ రంగ ప్రవేశం చేసింది. రష్మిక కన్నడ చిత్ర పరిశ్రమను పూర్తిగా విస్మరించిందని ఆయన అన్నారు. అలాగే కన్నడ భాషను కూడా విస్మరించి అగౌరవపరిచేలా మాట్లాడిందని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ కార్యక్రమానికి రష్మిక మందన్నను చాలాసార్లు ఆహ్వానించినప్పటికీ.. బెంగళూరు రావడానికి సమయం లేదని సమాధానమిచ్చిందని అన్నారు. మా శాసనసభ్యురాలు ఒకరు ఆమెను ఆహ్వానించడానికి 10 నుంచి 12 సార్లు ఆమె ఇంటికి వెళ్లారని గుర్తు చేశారు. కానీ రష్మిక కన్నడ పరిశ్రమను పట్టించుకోలేదని.. ఇలాంటి వారికి వారికి గుణపాఠం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. రష్మిక ప్రవర్తనకు తగిన పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా.. ఇటీవల బెంగళూరు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 16 వేడుకలు గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు శాండల్‌వుడ్ అగ్రతారలు హాజరు కాకపోవడంపై డీసీఎం డీకే శివకుమార్ సైతం మండిపడ్డారు.



# క్రీడా వార్తలు | SPORTS NEWS

# రొనాల్డో కోసం కళ్లు చెదిరే రేటు..

## వెయ్యి కోట్లకు పైనే.. తెలిస్తే షాక్ అవాల్సిందే!




క్రిస్టియానో రొనాల్డో ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్లబ్ లకు స్టార్ అట్రాక్షన్ గా కొనసాగుతున్నాడు. అతని కోసం క్లబ్ లు పోటీపడుతున్నాయి. ప్రస్తుతం సౌదీ ప్రో లీగ్ జట్టు అల్ నాసర్ క్లబ్ తరఫున రొనాల్డో ఆడుతున్నాడు. ఈ క్లబ్ తో అతని కాంట్రాక్టస్ ముగిసేందుకు చివరి దశలో ఉంది. దీంతో రొనాల్డో కోసం క్లబ్ లు క్యూ కడుతున్నాయి. కానీ అల్ నాసర్ క్లబ్.. రొనాల్డోను వదులుకునేందుకు సిద్ధంగా లేదని తెలిసింది.

**పోర్చుగీసా క్లబ్**

రొనాల్డో ను తమ జట్టులో ఆడించేందుకు బ్రెజిల్ లీగ్ కు చెందిన పోర్చుగీసా జట్టు ఇంట్రస్ట్ చూపిస్తోంది. పౌలిస్టా ఏ1 జట్టు పోర్చుగీసా ఇందుకోసం ప్రయత్నాలు చేస్తోందని తెలిసింది. పోర్చుగీస్ దేశానికి చెందిన రొనాల్డోను పోర్చుగీసా క్లబ్ కు ఆడించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1000 ప్రొఫెషనల్ గోల్స్ సాధించాలనే లక్ష్యంతో ఉన్న రొనాల్డో.. ఇప్పటివరకూ 925 గోల్స్ సాధించాడు.

**రొనాల్డోనూ ఒప్పిస్తాం**

రొనాల్డోను తమ జట్టులో చేరేలా ఒప్పించేందుకు ప్రయత్నిస్తానని పోర్చుగీస్ చీఫ్ అలెక్స్ బూర్జువా పేర్కొన్నాడు. బ్రెజిల్ లో పోర్చుగీస్ కమ్యూనిటీని చూడాలని ఆయన కోరుకుంటున్నాడు. "బ్రెజిల్లోని పోర్చుగీస్ కమ్యూనిటీ గౌరవాన్ని బలోపేతం చేయడం, రక్షించడం లక్ష్యం. 2026 సీజన్ కోసం గొప్ప పోర్చుగీస్ ఆటగాణ్ని (రొనాల్డో) రప్పించేందుకు ప్రయత్నిస్తాం'' అని సీఎన్ఎన్ తో అలెక్స్ బూర్జువా తెలిపాడు.




# ఆసీస్ గొప్ప జట్టు.. కానీ..

## రోహిత్ శర్మ కామెంట్స్ వైరల్

**ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో టీమిండియా టైటిల్ రేసులో ముందుకు దూసుకుపోతోంది. గ్రూప్-'ఎ'లో భాగంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్‌లను ఓడించి.. మూడింట మూడు విజయాలతో టాపర్‌గా నిలిచింది. ఇదే జోరులో సెమీ ఫైనల్లోనూ గెలుపొంది టైటిల్ పోరుకు అర్హత సాధించాలనే పట్టుదలతో ఉంది.**

### నాకౌట్ మ్యాచ్‌లలో..

అయితే, సెమీస్‌లో గ్రూప్-బి నుంచి ఆస్ట్రేలియా రూపంలో పటిష్టమైన ప్రత్యర్థి జట్టు రోహిత్ సేనకు సవాలుగా మారింది. ద్వైపాక్షిక సిరీస్‌ల సంగతి పక్కనపెడితే.. 2011 తర్వాత ఐసీసీ టోర్నమెంట్ల నాకౌట్ మ్యాచ్‌లలో కంగారూ జట్టు చేతిలో టీమిండియాకు పరాభవాలు తప్పడం లేదు. సొంతగడ్డపై లక్షలకు పైగా ప్రేక్షకుల నడుమ వన్డే ప్రపంచకప్-2023 ఫైనల్‌లో భారత్ కమిన్స్ బృందం చేతిలో ఓడిన తీరును అభిమానులు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో మంగళవారం దుబాయ్‌లో ఆసీస్‌తో జరిగే సెమీస్ మ్యాచ్‌లో ప్రతీకారం తీర్చుకోవాలని సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేస్తున్నారు. భారత మాజీ క్రికెటర్లు సైతం గత చేదు అనుభవాలను మరిపించేలా రోహిత్ సేన ఆస్ట్రేలియాను ఓడించి ఫైనల్లో అడుగుపెట్టాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ(Rohit Sharma) ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

### ఆసీస్ గొప్ప జట్టు.. కానీ..

"ఆసీస్ పటిష్ట జట్టు. మాకు గొప్ప ప్రత్యర్థి. అయితే, సెమీస్‌తో మ్యాచ్‌లో మా విధానం మారదు. గత మూడు మ్యాచ్‌ల మాదిరే మా ప్రణాళికలు ఉంటాయి. అయితే, ఆసీస్ జట్టును బట్టి వ్యూహాల్లో కొన్ని మార్పులు చేసుకుంటాం. ఇక సెమీ ఫైనల్ అంటే మా మీద మాత్రమే ఒత్తిడి ఉంటుందని అనుకోకూడదు. ఆస్ట్రేలియా పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. అయితే, జట్టుగా ఎలా రాణించాలన్న అంశం మీదే మేము ఎక్కువగా దృష్టి సారించాం. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణిస్తే మాకు తిరుగే ఉండదు. సుదీర్ఘకాలంగా ఆస్ట్రేలియా గొప్ప జట్టుగా కొనసాగుతోంది. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే, మేము కూడా తక్కువేమీ కాదు. ప్రత్యర్థి ముందు అంత తేలికగా తలవంచే రకం కాదు. ఇరుజట్లకు ఈ మ్యాచ్ అత్యంత ముఖ్యమైంది. మేము అన్ని విధాలుగా సన్నద్ధమవుతున్నాం. ప్రణాళికలు పక్కాగా అమలు చేస్తే.. అనుకున్న ఫలితం అదే వస్తుంది. దాని గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు" అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్‌పై విజయం తర్వాత పీటీఐతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశాడు. కాగా రోహిత్ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

### ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025

**భారత జట్టు:**

రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, అర్‌షదీప్ సింగ్, హర్షిత్ రాణా.

**ఆస్ట్రేలియా జట్టు:**

జేక్ ఫ్రేజర్-మెక్‌గర్క్, ట్రావిస్ హెడ్, స్టీవెన్ స్మిత్(కెప్టెన్), మార్నస్ లబుషేన్, జోష్ ఇంగ్లిస్(వికెట్ కీపర్), అలెక్స్ క్యారీ, గ్లెన్ మాక్స్‌వెల్, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, ఆడం జంపా, స్పెన్సర్ జాన్సన్, సీన్ అబాట్, ఆరోన్ హార్డీ, తన్వీర్ సంఘా, కూపర్ కన్నోలి.

# షమీ సాబ్.. ఇప్పటికే చాలా ఎక్కువైంది.. ఇక..: టీమిండియా దిగ్గజం



ఆస్ట్రేలియాతో సెమీ ఫైనల్‌కు ముందు టీమిండియాకు భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్(Harbhajan Singh) మూడు కీలక సూచనలు చేశాడు. కంగారూలకు ఏ దశలోనూ అవకాశం ఇవ్వకూడదని.. గత మూడు మ్యాచ్‌ల ఫలితాన్నే ఇక్కడా పునరావృతం చేయాలని కోరాడు. కాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా భారత్ గ్రూప్ఎ టాపర్‌గా నిలిచింది. ఈ మెగా టోర్నమెంట్‌కు పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తుండగా.. దుబాయ్(Dubai)లో తమ మ్యాచ్‌లు ఆడుతున్న టీమిండియా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. తొలుత బంగ్లాదేశ్‌ను.. ఆ తర్వాత చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్(India vs Pakistan)ను.. అనంతరం ఆఖరి మ్యాచ్‌లో భాగంగా న్యూజిలాండ్ జట్టును ఓడించింది. ఈ క్రమంలో ఈ వన్డే టోర్నమెంట్ తొలి సెమీ ఫైనల్లో భాగంగా మంగళవారం ఆస్ట్రేలియాను ఢీకొట్టనుంది. అయితే, ఐసీసీ టోర్నీల్లో 2011 తర్వాత నాకౌట్ మ్యాచ్‌లలో ఆసీస్‌దే పైచేయిగా ఉన్న నేపథ్యంలో భారత దిగ్గజ స్పిన్నర్ హర్భజన్ సింగ్ రోహిత్ సేనకు పలు సూచనలు చేశాడు. ముందుగా ట్రవిస్ హెడ్ ఆట కట్టించాలని.. ఆ తర్వాత గ్లెన్ మాక్స్‌వెల్ లాంటి వాళ్ల పనిపట్టాలని భారత బౌలర్లకు సూచించాడు. ఈ మేరకు స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడుతూ..

**షమీ సాబ్.. ఇప్పటికే చాలా ఎక్కువైంది కదా..**

"ముందుగా ట్రవిస్ హెడ్ గురించి మీ మెదళ్లలో గూడు కట్టుకున్న భయాన్ని తీసేయండి. వీలైనంత త్వరగా అతడిని అవుట్ చేయడం మంచిది. షమీ సాబ్.. ఇప్పటికే చాలా ఎక్కువైంది కదా.. హెడ్‌కు ఎక్కువ పరుగులు చేసే అవకాశం అస్సలు ఇవ్వద్దని గుర్తుపెట్టుకోండి. ఇక నా రెండో సూచన ఏమిటంటే.. గ్లెన్ మాక్స్‌వెల్, జోష్ ఇంగ్లిస్ వంటి హార్డ్ హిట్టర్లు ఆస్ట్రేలియా జట్టులో ఉన్నారు. వాళ్లు అలవోకగా సిక్సర్లు, ఫోర్లు బాదుతారు. ఫాస్ట్ పేస్‌లో వాళ్లకు ఎక్కువగా పరుగులు చేసే అవకాశం ఇవ్వకండి. మూడోది.. ముఖ్యమైన సూచన.. ఇది నాకౌట్ మ్యాచ్ అన్న విషయాన్ని మీరు పూర్తిగా మర్చిపోండి. సాధారణ మ్యాచ్ మాదిరిగానే దీనిని భావించండి'' అని భజ్జీ రోహిత్ సేనకు సలహాలు ఇచ్చాడు. ఈ మూడు బలహీనతలను అధిగమిస్తే విజయం కచ్చితంగా టీమిండియానే వరిస్తుందని అభిప్రాయపడ్డాడు.

**విధ్వంసకరవీరుడు.. చితక్కొట్టాడు**

కాగా ట్రవిస్ హెడ్‌కు టీమిండియాపై మంచి రికార్డు ఉంది. ముఖ్యంగా వన్డే వరల్డ్‌కప్2023 ఫైనల్లో మ్యాచ్ టీమిండియా చేజారడానికి ప్రధాన కారణం ఈ విధ్వంసకరవీరుడు. నాడు అహ్మదాబాద్ మ్యాచ్‌లో భారత స్పిన్ త్రయం కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా.. బౌలింగ్‌ను చితక్కొట్టాడు. కేవలం 120 బంతుల్లోనే 137 పరుగులు సాధించి ఆసీస్ ఆరోసారి విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలోనే భజ్జీ హెడ్‌ను టార్గెట్ చేయాలని భారత బౌలర్లకు చెప్పాడు.

**టీమిండియాదే గెలుపు**

ఇదిలా ఉంటే.. టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ రోహిత్ సేనకు మద్దతు పలికాడు. "గతేడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టు ఇది. వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ కూడా దాదాపుగా వీళ్లే ఆడారు. ఏ రకంగా చూసినా మన జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా ఎదిగింది. ప్రత్యర్థి జట్టు ఏదైనా దానిని ఓడించగల సత్తా టీమిండియాకు ఉంది'' అని పేర్కొన్నాడు. సెమీ ఫైనల్లో భారత్ ఆసీస్‌ను ఓడించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com